# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

సంపాదక వర్గము

గూడూరి వెంకట రత్నం

డి.జె. బాలకృష్ణ లాల్

డా॥ఎస్. రామతారక పరబ్రహ్మ శాస్త్రి

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి

సంపుటి 35 సంచిక 1
పేజీలు 40
సెప్టెంబర్ 2015

5సం॥ల చందా రూ. 250
2సం॥ల చందా రూ. 120
సంవత్సర చందా రూ. 60
విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్టు A/C Y.S.C.K.P.M
చారిటబుల్ ట్రస్ట్ పేరుతో డ్రా చేయండి.
M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL

*ఈ సంచికలో* ............................ ....... *పేజీ*

భద్రవాక్యం ........................................2
శ్రీబాబూజీ ఉవాచ................................3
అమ్మమాట..........................................5
త్రికాలజ్ఞాన సంపన్నులు-సద్గురునాధులు.....7
శ్రీకృష్ణ జన్మాష్టమి - విశిష్ఠత ..................8
బంగారు క్షణాలు ...............................10
సన్నిధిలో సంభాషణ ..........................12
యోగవాశిష్ఠము .................................14
శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు.....................16
పరిప్రశ్నేన సేవయా ............................17
సందేహింపకుము సుమ్మీ! ...................... 18
గీతాధ్యయనమ్...................................19
శ్రీకృష్ణకర్ణామృతము.............................21
యోగీశ్వరుడు - విఘ్నేశ్వరుడు ................22
సుధీర్ - భోక్తా ..................................24
అమృతబిన్దూపనిషత్ ...........................25
మహాభారత నీతి చంద్రిక.......................27
త్యాగాచ్ఛాన్తి రనన్తరమ్ .......................29
అమెరికా పర్యటనలో శ్రీమాతాజీ బోధ........30
విజయవాడలో సత్సంగ సమావేశములు....32
సత్సంగామృతం...................................33
సోమదత్త ఎక్కడ? ..............................35
సమర్థ సద్గురునాధుని దివ్య చరిత్ర...........37
విష్ణు కథలు- భక్త కబీర్‌దాస్.................39

# భద్రవాక్యం

- పరాశర ప్రసాద్

యస్మిన్ సర్వాణి భూతాని ఆత్మైవా భూద్విజానతః।
తత్ర కో మోహ కశ్శోకః ఏకత్వమ్ అనుపశ్యతః॥

(ఈశ్యావాశ్యోపనిషత్ 7 శ్లో॥)

ఆత్మానుభూతి సర్వవ్యాపకమైనది. అది ఒక దేశానికి, కాలానికి పరిమితమైనది కాదు. గుర్తించినవారికి జ్ఞానులు, అజ్ఞానులు అనే భేదం కాని, మానవులు, ఇతర ప్రాణులు అనే వివక్షత గాని, దేశము కాలము అనే భేదముగాని లేక అంతటా చూడ గలిగినంత, ఊహించ గలిగినంత అనుభవించగ గలిగినంత ఆత్మ తత్త్వాన్ని అందిస్తోంది.

గుర్తించినవారికి జగత్తు ఆత్మబోధను అందిస్తోంది. గుర్తించని వారికి జగత్తులో నిస్సారమైన జనన మరణ ప్రవాహము, కర్మబంధనము మాత్రమే గోచరిస్తోంది. జగత్తులోని భోగాలన్నీ సంతృప్తిని యివ్వటం లేదని గ్రహించి, వ్యథకు గురై చివరికి విషయాదులన్నిటిని త్యజించి, తుదకు తానెంతో ప్రేమించిన దేహాన్ని సహితము త్యజించక తప్పటం లేదు.

విషయాదులన్నీ పట్టుకున్నంతవరకు చింతలతోనే జీవించి, వాటిని విడిచిన తరువాత నిశ్చింత పొందాడు. జీవులందరూ తమకు కలిగిన సదవకాశాన్ని జారవిడుచుకోకుండా సద్వినియోగము చేసుకోవాలన్నదే ఉపనిషత్తు సందేశము.

జీవులకు కలిగిన దుస్థితి నుండి బయటపడే మార్గము విచారణ, ఆచరణ, జ్ఞానము తప్ప మరే ఉపాయము లేదు. దానిని గుర్తించిన జ్ఞాని జగత్తులో దేనిని గురించి శోకముగాని, మోహము గాని దరిజేరనివ్వడు.

ఏకత్వం అనుపశ్యతః - అన్నది ఒక్కటే సరియైన మార్గమని బోధను గుర్తించి ఆచరించినప్పుడే ఏకత్వం, సమత్వం సాధ్యమని గుర్తించ గలుగుతాడు. అతడే జ్ఞాని. విషయాదులు అతని దరిజేరవు.

# శ్రీ బాబూజీ ఉవాచ - పరాశర ప్రసాద్

శ్రీ బాబూజీ మహరాజ్ భక్తులకు బోధచేస్తూ "మానవుడికి తృప్తికల్గుతుందా? ఎంత ధనాన్ని సంపాదించినా ఇంకా ఏదో సంపాదించలేదనే అసంతృప్తి, పోనీ పండితుడు ఉన్నాడనుకోండి ఎన్ని గ్రంథాలు చదివినా సంతృప్తి ఉండదు కదా! ఉద్యోగస్తుడిని తీసుకోండి ఎంత ఉన్నత స్థితికి ఎదిగినా ఇంకా ఏదో సాధించాలనే ఆకాంక్ష వుండక పోతుందా! ప్రతి మానవుడు తాను ఏదో పొందాలనే వాంఛిస్తాడు కదా కాని వారు కోరుకున్నది ఏదైనా మానవ జీవితాన్ని పొందినందుకు వారు తాము చేరవలసిన గమ్యస్థానాన్ని చేరగల్గుతారా! జన్మకి వచ్చిన ప్రతి మానవుడు మృతి చెందవలసిందే కదా! ఎవరైనా మరణించిన వారిని చూసి ఆ క్షణంలో మనస్సు మరణాన్ని గురించి ఆలోచించవచ్చు కాని మరుక్షణమే దానిని మరచిపోగల్గుతున్నాడు కదా! మరణ వేదన చాలా భయంకరమైనది. దానిని గురించి మీకు చెపితే హడలి చస్తారు.



మృతి చెందిన మానవుడు తిరిగి మానవ జన్మకి వస్తాడని గ్యారంటీ లేదుకదా! ఈ స్థూల దేహాన్ని వదిలిన జీవుడు తాను చేసిన కర్మననుసరించి సూక్ష్మదేహంతో పడే బాధ వర్ణనాతీతం సుకృత కర్మ చేసి ఉంటే పుణ్యలోక ప్రాప్తి కల్గుతుంది. దుష్కృతకర్మ రౌరవాదినరకాలకు తీసుకువెళ్తుంది. తిరిగి గజ్జి కుక్కగానో, కుంటి నక్కగానో, కొండచిలువ గానో లేక మలములో పురుగుగానో జన్మించవచ్చు మానవుడు ప్రాపంచిక సౌఖ్యాన్ని కోరుకుంటున్నాడు గాని జనన మరణ విషవలయం నుండి సంరక్షించుకొని తన జీవిత పరమార్ధాన్ని సాధించే మార్గాన్ని గురించి ఆలోచించడు. పోనీ భగవానుడు జీవకోటిని ఉద్ధరించటానికి మహాత్ముల రూపంలో అవతరించి ఎంత హెచ్చరించినా దానిని పెడచెవిన పెడతారు. ఇటువంటి మానవులు మహాత్ములని విమర్శిస్తారు.

మానవులని ఉద్ధరించటానికి భగవానుడు స్వయంగా మానవాకారంలో అవతరించి చేసే బోధని ఎలా విస్మరించగల్గుతున్నారు చెప్పండి? బుద్ధ భగవానుడు మానవ జీవితం నీటి బుడగ లాంటిది, అంతా శూన్యం అని బోధిస్తే ఆయనది నాస్తికవాదం అన్నారు. ఆయన

అంతా శూన్యం అన్నారు. అది యదార్ధమే కదా! ఉల్లిపాయలో పొరలన్ని తీసివేస్తే మిగిలేది పొరలు తీసిన వాడొక్కడే కదా! బుద్ధ భగవానుడు అందమైన భార్యను, రాజభోగాలను ఒక్కగానొక్క అందాల కుమారుడిని త్యజించి ధ్యాననిష్ఠలో తానెవరో తెలుసుకున్నాడు కదా! మనస్సు నిర్వాణ స్థితిని పొందింది. అంతకన్నా కావలసింది ఏముంది? తాను ఏదైతే అనుభవించాడో దానినే బోధించాడు. ఆయన పొందిన అనుభవము సత్యమే కదా! ఆయన బోధించింది కూడా సత్యమే! కాబట్టి మానవుడు జనన మరణ విషవలయం నుండి రక్షింపబడే మార్గము సమర్ధులైన సద్గురుమూర్తిని ఆశ్రయించటమే.

మృత్యువు అంటే ఎవరికైనా భయమే. మరికొంతమంది మృత్యువు అంటే ఎంత భీతి చెందుతారంటే తమకు ఏదైనా వ్యాధి సంక్రమిస్తేచాలు మృత్యువు సంభవిస్తుందేమోనని దుఃఖిస్తారు. ఇంకా కొంతమంది మాకు మృత్యువు అంటే భయంలేదు అని ధైర్యంగా చెప్పవచ్చు. మానవుడికి దాని వలన ప్రయోజనంలేదు. సమర్ధులైన సద్గురుమూర్తిని ఆశ్రయించి ఆయన ప్రసాదించిన లక్ష్యార్ధాన్ని పటిష్ఠమైన సాధన ద్వారా సాధించిన వారికి మాత్రం మృత్యుభయం ఉండదు. గురుసాన్నిధ్యంలో మృత్యువుకి స్థానములేదు. మృతి చెందేది యీ దేహం. కాని ఈ దేహాన్ని ప్రకాశింపచేసే ఆత్మని నేను అని గుర్తించగలిగే సాధకునికి మృత్యుభయం ఉండదు. సాధన అంటే సద్గురుమూర్తి చేసిన బోధని శ్రవణం చేసి వివేకవంతమైన విచారణ చేయాలి. విచారణ ద్వారా నీ జీవిత విధానాన్ని మార్చుకోవాలి. నీలో ఉన్న నీచ భావాలు, నీచ సంకల్పాలు, నీచ గుణాలన్నింటిని బియ్యంలో రాళ్ళు ఏరినట్లు ఏరి పారవేయాలి.

నీ సాధన పటిష్టంగా ఉంటే నీ జీవిత విధానములో మార్పు తప్పక వస్తుంది. సద్గురుమూర్తిని ఆశ్రయించి తన సాధనని సక్రమంగా చేసుకునే సాధకునికి బురుజుని ఆశ్రయించిన గింజకు ఏ ప్రమాదం లేనట్లుగానే మృత్యు భయం ఉండదు. పరీక్షిన్మహరాజు శాపగ్రస్థుడై వారంరోజులలో తాను మృత్యువాత పడనున్నాడని తెలిసినా భీతిచెందలేదు. మృత్యువుని జయించే మార్గాన్ని అన్వేషించాడు. సమర్ధుడైన సద్గురుమూర్తిని ఆశ్రయించాడు ఆయన బోధ శ్రవణం చేశాడు. తనజీవిత పరమార్థమేమిటో తెలుసుకున్నాడు" అన్నారు.

(గత సంచిక తరువాయి) **అమ్మ మాట** - జపమాల ప్రసాద

## 'అవ్యక్తమ్ వ్యక్తిమాపన్నమ్'

మన మనస్సు ధ్యేయవస్తువులో లీనమయినప్పుడు మన చుట్టూ యేమి జరుగుతున్నా మనకు తెలియదు. ధ్యానంలోని యీ స్థితిని మెలకువలో పొందాలి. ధ్యాన సమయంలో మన సహజ స్వరూపమే బహిర్గత మవుతుంది. ధ్యానం అందరికీ తెలిసినదే, కానీ మరుపుకి వచ్చింది. కనుకనే యిప్పుడు మళ్ళీ పురుష ప్రయత్నం చేయాల్సి వస్తుంది. పాఠం అందరికీ తెలిసినదే. కానీ ఆచరణే లోపిస్తోంది.

'బ్రహ్మజ్ఞానికి ఒక దానిపైనే ఆశ' - గురుదేవులు చెప్తేనే మనకి గురుతత్త్వం తెలుస్తోంది. మన స్వస్వరూప స్థితిని మనం గుర్తించేటట్లు చేస్తున్నారు మహాత్ములు. ఇదొక్కటే వారి ఆశ, వారికి లేదు వినాశము. మహాత్ములు వినయ పూర్ణులు. ఒక్కసారి గురువుల దగ్గర శుశ్రూష చేసిన వారెంత వినయ సంపన్నులై వుంటారో చూస్తే మీకే తెలుస్తుంది.

ఒక కాపాలికుడు వచ్చి, శ్రీ ఆదిశంకర భగవత్పాదాచార్యులవారిని వారి యొక్క శిరస్సు తనకి కావాలని అడిగినప్పుడు, ఆయన తొణకలేదు, బెణకలేదు. 'మేము ధ్యానములో వున్నప్పుడు, మా పద్మపాదుడు మాత్రం దగ్గర లేకుండా చూసుకుని, నీ పని నువ్వు చేసుకో!' అన్నారు. ఆహా! మన ధ్యానానికి యీ ముద్ర చాలదూ? 'ధియో యోనః ప్రచోదయాత్' - ఇది శిష్యుడికి కూడా పరీక్షే!

పాద పూజలు చేయడం సుఖమనుకుంటున్నారా? మన గురువులది ఒప్పుకోలేదు. వారికి పూజ అంటే ఏది? పూర్ణమైన విశ్వాసంతో గురు సుప్రసాదము (లక్ష్యార్థం) అనుభవించడమే వారికి మనం చేసే నిజమైన పూజ. బ్రహ్మజ్ఞాని పరోపకారి, నిత్య సంతోషి.

ఒకసారి ఒకాయన స్వామివారి వాచ్ కావాలన్నారు. అది వెంటనే తీసి ఆయన చేతికి పెట్టారు స్వామి. తాము ఆరగిస్తున్న భోజనం కూడా త్యాగం చేశారు వారు. బ్రహ్మజ్ఞాని చేయునదంతా మంచియే; వారిచ్చేది కేవలం ఆత్మఫలమే. మనం అంతరాంతరాళలోకి వెళ్ళి విచారణ చేయాలి. బ్రహ్మజ్ఞాని సదాసదా జాగరూకుడు. భగవంతుడి దగ్గర మనకెప్పుడూ భద్రమే. ప్రపంచ విషయంలోనే జాగరూకులమై వుండాలి. ఈ విచారణ

మొదలు దొరికితే చాలు. ఇలా చేస్తే, ధ్యానంలో రెండు గంటలు యిట్టే వెళ్లిపోతాయి! దీనికి మూలం ప్రణవం. నాభి నుండి ప్రణవాన్ని పూరించి నప్పుడు అది మీ సర్వేంద్రియాలలోనూ నిండిపోతుంది. శ్రీగురుదేవులు అన్నది ఒక్కటే - 'నువ్వు వున్నది ఓంకారంలోనే' కనుక,

ధ్యానమూలం గురోర్మూర్తిః పూజా మూలం గురోః పదమ్ ।
మంత్రమూలం గురోర్వాక్యం । ముక్తి మూలం గురోఃకృపా ॥

అట్టి గురుమూర్తిని వ్యక్తిగా కాక, అవ్యక్త పరమాత్మ వస్తువుగా గుర్తించండి. అఖండ భక్తి, జ్ఞాన, వైరాగ్యములను, అఖండ సాధన సంపత్తిని ప్రసాదించి గురుపాదుకలు సర్వదా మనలను కాపాడుగాక! సుఖీభవ!!

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

సెప్టెంబర్ 2015

5 శనివారం శ్రీకృష్ణాష్టమి, - సాయంత్రం 5-30ని॥లకు సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం, తీర్థప్రసాదాలు.

7 సోమవారం శ్రీగురుదశమి
సాయంత్రం 5-30ని॥లకు సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, మహాప్రసాదం.

17 గురువారం వినాయక చవితి.
శ్రీగణపతిపూజ; శ్రీసద్గురుపాదపూజ, తీర్థ ప్రసాదాలు.

28 సోమవారం పూర్ణిమ
సాయంత్రం 5-30ని॥లకు సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, మహాప్రసాదం.

30-9-15నుండి4-10-15వరకుశ్రీమాతాజీవారి సత్సంగసమావేశాలు

అక్టోబర్ 2015

7-10-15 బుధవారం శ్రీగురుదశమి -సాయంత్రం 5-30ని॥లకు శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం, మహాప్రసాదం.

13-10-15 నుండి 22-10-15వరకు శరన్నవరాత్రి పూజలు.

22-10-15 గురువారం విజయదశమి - ఉదయం 11గం.లకు శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం, మహాప్రసాదం.

27-10-15 పూర్ణిమ -
సాయంత్రం 5-30ని॥లకు సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, మహాప్రసాదం.

వివరములకు : జగదీశ్వర్ సెల్ - 99856 66797

# త్రికాలజ్ఞాన సంపన్నులు శ్రీసద్గురునాథులు

-సుశీలా ప్రసాద

శ్రీబాబు త్రికాలవేది అని తెలియజేసే లీల యిది. ఒక రోజు నేను ఏలూరు నుండి గుంటూరు దగ్గర మా ఊరు పొన్నెకల్లు వెడదామని బయలు దేరాను. తీరా శ్రీబాబు గుంటూరులో పాండన్నయ్యగారింట్లో వున్నారని తెలిసి వారి దర్శనార్థం వారింటికి వెళ్ళాను. నేను వెళ్ళేసరికి శ్రీబాబు అక్కడి నుండి ఒంగోలు వెళ్ళటానికి సిద్ధంగా వున్నారు. నాకు చాలా ఆశ కలిగింది అక్కడికి వెళ్ళాలని. అయితే శ్రీబాబుతో నేనూ వస్తాను అని అనటానికి భయం వేసింది.

చంపక, శారదలను (భీమవరం తాతయ్యగారి కోడలు, కూతురు) కూడా తమతో రమ్మనమని శ్రీబాబు సంచీ సర్దుకోమని వాళ్ళతో చెప్పారు. పాండుగారిని, గురువుగారిని కూడా ఒంగోలు బయలు దేరమన్నారు. గురువుగారితో 'నేనూ వస్తానని బాబుతో చెప్ప'మని చెప్పాను. ఆవిడ నన్ను నాతో వచ్చెయ్యి. నేను శ్రీబాబుకి చెబుతానులే అన్నారు. సరే అని నేను సంతోషంగా వెళ్ళాను. బస్సులో ఎక్కి కూర్చున్నాము. పాండుగారు, గురువుగారు, నేను. టిక్కెట్లు తీశారు. 'అమ్మయ్య!' అని ఊపిరి పీల్చుకున్నాను.

ఇంతలో సీతయ్యగారు సైకిల్‌మీద రొప్పుకుంటూ వచ్చి, 'అమ్మా! సుశీలా! నిన్ను బాబు ఒంగోలు రావద్దన్నారు. వెనక్కి వచ్చెయ్యమన్నారు' అని చెప్పి నన్ను యింటికి తీసుకెళ్ళిపోయాడు. అప్పటికి శ్రీబాబు కారులో బయలుదేరి ఒంగోలు వెళ్ళిపోయారు. నాకు విపరీతంగా ఏడుపు వచ్చింది. ఎందుకు బాబు యిలా చేశారో అర్థం కాలేదు నాకు.

ఆ మధ్యాహ్నం తెలిసింది! మా వారు నన్ను తీసుకెళ్ళటానికి వచ్చారు. నేను లేకపోతే వారికి మళ్ళా యిబ్బంది కలుగుతుందని తెలిసి, శ్రీగురుదేవులు నన్ను ప్రయాణం ఆపేశారని! శ్రీగురుమూర్తితో చెప్పకుండా వారి ఆజ్ఞ తీసుకోకుండా నేను ప్రయాణం కట్టటం తప్పు అని నాకు తెలిసి, క్షమించమని శ్రీబాబుని మనస్సులో వేడుకున్నాను.

'కాలజ్ఞాన విదగ్రణిం శివకరం కాశీసమం సద్గురుం।
బ్రహ్మజ్ఞానమయం నమామి హనుమత్కాశీ ప్రసాదాహ్వయం!'

# శ్రీకృష్ణ జన్మాష్టమి - విశిష్టత

- రమణ ప్రసాద్



శ్రీ కృష్ణుడు భగవంతుడా? లేక చరిత్రలోనివాడా? అన్న విషయం ఆలోచిస్తే, శ్రీ కృష్ణుని జన్మస్థలమైన 88 కిలోమీటర్ల విస్తీర్ణం కల బృందావనంలో షుమారు 5000 శ్రీకృష్ణుని ఆలయాలు వుండటం కాకతాళీయం కాదని, అవి ప్రజలకు శ్రీ కృష్ణుని ఎడల గల భక్తి ప్రపత్తులకు ప్రతీకలు అని విదితమవుతుంది. అరేబియా సముద్రంలో ద్వారక ప్రాంతంలో బయల్పడుతున్న పురాతన కట్టడాలు శ్రీకృష్ణుడు నిర్మించిన ద్వారకానగర వైభవాన్ని చాటుతాయి. కురుక్షేత్రం లోని శిథిలాలు యీ నాటికీ అక్కడ జరిగిన మహాభారత యుద్ధానికి తార్కాణాలుగా మనకు కన్పడతాయి. కాబట్టి శ్రీకృష్ణుడు చారిత్రాత్మక పురుషుడు. కాదు కాదు - ఆయన అవతార పురుషుడు. 'కృష్ణం వందే జగద్గురుమ్' . ఆయన జగద్గురువు. శ్రీకృష్ణ జన్మాష్టమి మనమందరము భక్తితో, ఎంతో హర్షోల్లాసలతోజరుపుకొనే పండుగ..

తార్కికంగా ఆలోచిస్తే ఈ సృష్టి ఎవరో ఒక అనంత శక్తివంతునిచే నిర్మింపడడినదని గ్రహించవచ్చు. శాస్త్రాలు, వేద పురాణాలు కూడా ఈ విషయాన్నే చాటుతున్నాయి. ఆ శక్తివంతుడు యెహూవా అని, అల్లా అని, రాముడని లేక వారు నమ్మే వాని పేరునైనా పిలపవబడతాడని శాస్త్రాల ద్వారా మనకి తెలుస్తోంది.

నల్లనివాడు, నగుమోము కలవాడు, కౌస్థుభధారుడు, నెమలి

పించమువాడు, రాధా మనోహరుడు, అయినవాడే మనం నిత్యము ఆరాధించే జగన్మోహనాకారుడైన శ్రీకృష్ణుడు. ఆయన నిత్యుడు, పరబ్రహ్మము, సృష్టి, స్థితి, లయాలకు కారకుడు. సాధువులను రక్షించటానికి, దుష్టులను శిక్షించటానికి, ప్రపంచంలో పుట్టే అలజడులను శాంతింపచేసి ధర్మ స్థాపన చేయటానికి యుగ యుగాలలో అవతారం ధరించివచ్చే వాడే శ్రీకృష్ణ భగవానుడు. ఈ విషయాన్ని ఆయనే భగవద్గీతలో చెప్పి ఉన్నాడు:

పరిత్రాణాయ సాధూనాం, వినాశాయచ దష్కృతాం ।
ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥ గీ (4/8)

శ్రీకృష్ణుడు జగన్నియంతే కాదు. సర్వ భూత హితుడు.

భోక్తారం యజ్ఞ తపసాం, సర్వలోక మహేశ్వరమ్ ।
సుహృదం సర్వభూతానాం జ్ఞాత్వామాం శాంతిమృచ్ఛతి॥ గీ(5/29)

ఆ పరమ పురుషుని భక్తితో కొలిస్తే మన జన్మ ధన్యమవుతుంది. కాని మనం కాలాన్నంతా ప్రపంచ విషయాలపై వినియోగించి దుఃఖాల పాలవుతున్నాము. అలా దిగజారుతున్నా, వారిని ఉద్ధరించటానికోసమే శ్రీకృష్ణుడిగా అవతారం ధరించి ఎన్నెన్నో లీలలు చూపాడు. గోవర్ధన పర్వతాన్ని ఎత్తి ప్రజలు ఇంద్రుని కోపానికి గురి అవకుండా కాపాడాడు. ఎందరో రాక్షసులను సంహరించి నంద వ్రజంలోని వారి భయాన్ని పోగొట్టాడు.

5000 ఏళ్ళ క్రిందట శ్రావణ బహుళ అష్టమి నాటి అర్థ రాత్రి సమయంలో కుండపోతగా వర్షం కురుస్తూ ఉండగా, యమునానది పరవళ్ళు త్రొక్కుతూ ఉండగా చెరసాలలో, చతుర్భుజుడైన శ్రీమన్నారాయణుడు దేవకీ వసుదేవులకిచ్చిన మాట ప్రకారం వారికి చిన్న శిశువుగా జన్మించాడు. తన యోగమాయ చేత చెరసాల తలుపులు తెరుచుకున్నాయి. యమునా నది దారి ఇవ్వగా ఆ బాలుని గోకులానికి చేర్చాడు తండ్రి వసుదేవుడు. మన హృదయాలలో కృష్ణుడు ఉదయించినప్పుడే అది నిజమైన జన్మాష్టమి అవుతుంది. ఆయన ప్రేమను చూరగొన్నప్పుడే మన జన్మ ధన్యమవుతుంది!

# బంగారు క్షణాలు

- డా॥ స్వర్ణముఖి

(గత సంచిక తరువాయి)

శేషమ్మగారు - నిజమైన శిష్యుడెలా వుంటాడంటే ...

నీవెంత కొట్టి తిట్టిన నే విడిచే వాడను గాను
నీ చరణంబుల్
చావైన పెండ్లియైనను నే విడువనటంటి వట్టి
నిజ భక్తుడవేరా
నే కనుగొంటి నీ నిష్ఠవౌరా కావున నీ కిట్టి
ఘనమైన యీ బోధ
నే వేగ దయచేస్తి నీవిది విడువాకు నిజ భక్తుడవేరా
నే కనుగొంటి నీ నిష్ఠ నౌరా

శ్రీబాబు : చక్కగా చెప్పావమ్మా! నిజమైన భక్తుడి స్థితి ఆ విధంగా వుంటుంది. అతడంటాడు 'గురుదేవా! మీరు నన్ను కొట్టినా, తిట్టినా, అవమానించినా, ఛీ ఫో అని వెడలగొట్టినా సరే, లేక పెళ్ళి చేసి, కూర్చుండ బెట్టినా సరే మిమ్మల్ని మాత్రం విడువను. బెల్లం పట్టిన చీమ తన తలనైనా వదులుకుంటుంది గాని, తాను పట్టుకున్న మధురాన్ని యే విధంగా అయితే వదులుకోదో, నేను కూడా మరణమైనా చిరునవ్వుతో స్వీకరిస్తాను గానీ, మధురామృత స్వరూపులైన మిమ్మల్ని మాత్రం ఒక్క క్షణం కూడా విడువను. మీరు నాకు ఎన్ని పరీక్షలు పెట్టినా వాటన్నిటినీ ధైర్యంగా యెదుర్కొని నిలుస్తాను. ఎందుకంటే మీరు నాకు రక్షకులై యుండగా నాకు భయమేల? సత్యవస్తు దర్శనమునకై యెన్ని యిక్కట్లు అయినా సరే భరిస్తాను' శిష్యుడు యీ విధంగా సమాధానం చెబితే గురువుకు అంతకంటె కావలసినదేమున్నది?

'ఆహా! నా శిష్యుడెంత గట్టివాడు!' అని మనసులో సంతోషించి 'నాయనా! నా బిడ్డా! నీ యొక్క నిష్ఠ నాకు తెలిసింది. ఘనమైన ఆత్మ బోధ నీకు తక్షణమే చేస్తాను. నిన్ను జీవబంధ రహితునిగా చేస్తాను. నీవు మటుకు దీనిని యెప్పుడూ కూడా విడువరాదు సుమా! నేనిచ్చిన లక్ష్యార్థమందే నీ దృష్టిని సదా నిలిపి, దాని యందు నీ మనస్సును లయింప జేసినట్లయితే నీకు ఆత్మదర్శనం అవుతుంది. జనన మరణ

రహితమైన శాశ్వతమైన ఆనంద పదవిని, మోక్షసామ్రాజ్యాన్ని పొందుతావు' అని ఆ గురుదేవుడు యెంతో సంతోషంతో తన శిష్యునికి ఆత్మ జ్ఞానం బోధిస్తాడు.

మరి యే ఆచార్యుడైనా కోరుకునేది యిటువంటి నిజమైన శిష్యుడిని గాని, వెళ్ళిపోతాననే వాళ్ళు ఆయనకెందుకు? వెళ్ళిపోతే నష్ట పోయేది వాళ్ళేగాని, ఆయన కాదుకదా! ఉంటే లాభం పొందేదీ వాళ్ళే! గురుమూర్తి యెప్పుడూ సాక్షి! ఆయన నిత్యుడు, నిరంజనుడు, శాశ్వతుడు. ఆయనలో మార్పు లేదు.

గురుదేవుడు అంటే యెటువంటివాడు అమ్మన్నా? (అని శ్రీబాబు చిరంజీవిరాజుగారి తల్లిని అడిగారు).

అమ్మన్నగారు -

మన్నాథో శ్రీ జగన్నాథః। మద్గురో జగద్గురో।
మమాత్మా సర్వభూతాత్మా। తస్మై శ్రీ గురవే నమః॥
చైతన్యం శాశ్వతం శాంతమ్। వ్యోమాతీతం నిరంజనమ్।
నాదబిందు కళాతీతమ్। తస్మై శ్రీ గురవే నమః।

శ్రీబాబు -

అటువంటి గురుదేవులను ఆశ్రయించి మనమందరం కూడా తరించాలి. ఇంకేమని అన్నాడాయన శేషమ్మగారూ?

శేషమ్మగారు -

కొట్టితి తిట్టితి శ్రమలన్ బెట్టితి
నీ మనవి చెవున
బెట్టక పెడచౌ బెట్టితి, మొట్టితి, వెడలన్
గొట్టితి,
నీ మనసు తెలియ, కోపము లేకా, సరె తెలిసె, నీ
వోపిక పోకా, పట్టు మిచ్చెద యింక నట్టేమి యని
దనియ - బుట్ట యిచ్చితి బోధ గట్టివాడవు రోరి
కోపాము లేకా సరె తెలిసె నీ వోపిక పోకా॥

-సశేషం

# సన్నిధిలో సంభాషణ

- పరాశర ప్రసాద్

27.12.85

శ్రీబాబు భక్తులనుద్దేశించి మాట్లాడుతూ "మా పిన్ని, అంటే ఎవరో కాదు, వడాలి పిన్నిగారు, 'కస్తూరి రంగా, నువ్వే కస్తూరి రంగా' అనే పాట పాడుకునేది. ఆవిడ జుట్టు నెరిసిపోయింది. పళ్ళు కూడా ఊడిపోయాయి. అలాగే మీలో గుణాలు కూడా హరించిపోతాయి అంటాడు భగవానుడు. ఏది పిన్నీ! పాడమ్మా పాడు. మీ తబలా, తాళం ఆపండి. ఆవిడ పాట వినబడటం లేదు. కొంచెము గట్టిగా పాడవమ్మా! ఇప్పుడు వినపడుతోంది ఆవిడ పాట. ఈవిడకి ఎంత ఆచారమో! నేను ఇంట్లో అన్నం తిన్న తర్వాత పేడతో అలికి పసుపు నీళ్ళు చల్లి శుద్ధి చేసేది. ఆవిడ అన్నం తినేటప్పుడు నేను చూస్తే తను మైలపడిపోతాననుకునేది. అది అప్పటి సంగతి లెండి. ఆవిడ పాట పాడేటప్పుడు నేను ఒక ప్రక్కన నిలుచుని వినేవాడిని. అది మా ఆచారము. భగవంతుడు భక్తవత్సలుడు.



ఆయన భక్తుడి భక్తికి ముగ్ధుడవుతాడు. అంతేకాని మరి ఏ ఇతరములైనవి ఆయనను ఆకర్షించలేవు. పాడమ్మా పాట. భగవానుడు మీ గొంతు ఎలా ఉన్నా, స్వరము ఎలా ఉన్నా మీ పాటను స్వీకరిస్తాను అంటున్నాడు. ఆయనకు కావలసింది మీలో భక్తి. అంతేకాని ఇంక ఏమి కోరడు. ఏమ్మా పిన్నీ! కస్తూరి రంగా అని పాడేదానివి కదా! దాని అర్థం చెప్పమ్మా. మీరు పాడే పాటలో చాలా అర్థం ఉందమ్మా" అన్నారు.

శ్రీబాబు ఇంకా మాట్లాడుతూ "కస్తూరి అనే పదంలో 'క' అనేది కర్మని రహితం చేస్తుంది. కర్మరహితం అయితే భవబంధముల నుండి విముక్తుడవుతాడు. కర్మరహితం కావాలంటే నీలో భక్తి ద్వారా వుత్పన్నమయ్యే అగ్నికి అది దగ్ధం కావాలి 'కస్తూరి' లో 'రి' అగ్ని బీజం. కాబట్టి కర్మ అగ్నికి దగ్ధం అయితే 'సు' అంటే ఆత్మవస్తువు కాబట్టి రంగడు మీ హృదయంలోనే ఉన్నాను మీలోనే వున్నాను అంటున్నాడు. మీకొక

వృదంతము చెప్తాను.

ఒక బాలుడు ఉన్నాడు అనుకోండి. వాడిని బజారు వెళ్ళి ఏవో సరకులు తీసుకు రమ్మన్నారనుకోండి. ఆ బాలుడు బజారు వెళ్ళాడు. కాని ఇంతలో ఎవరో ఆ బాలుడి జేబులో పైకం దొంగిలించారు. చీకటి పడింది. ఇంటికి వెడితే తల్లిదండ్రులు తిడతారేమోనని భయపడ్డాడు. అటువంటి సమయంలోనైనా భగవంతుడిని స్మరిస్తే నిన్ను వుద్ధరిస్తాను అంటున్నాడు. అప్పుడు ఆయన ఒక కిరణాన్ని ఆ తల్లిదండ్రులలో ప్రవేశపెడతాడు. అంతవరకు వారిలో ఉన్న మరపు లేక ఏమరుపాటు పోయి వాళ్ళకు పిల్లవాడు గుర్తుకువస్తాడు. వెంటనే వాళ్ళు పిల్లవాడి కోసం అటు ఇటు తిరుగుతారు. భగవానుడు పిల్లవాడిని లభింపజేస్తాడు. అంతేకాదు, ఆ పిల్లవాడిని తల్లి తన హృదయానికి హత్తుకొంటుంది.

అలాగే మానవుడు ప్రపంచము అనే బజారులోకి వచ్చి తాను వచ్చిన పనిని మరచిపోయి భగవంతుని ప్రేమకు, కరుణకు దూరం అవుతున్నాడు. బజారుకు వెళ్ళిన బాలుని యొక్క ఏమరుపాటు వలననే కదా దొంగలు ధనాన్ని తస్కరించారు? మానవుడు భగవంతుని ఎడల అటువంటి ఏమరుపాటు కలిగి ఉండటం వలననే కదా తనలోని కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు అనే దొంగలు జ్ఞానరత్నాన్ని అపహరించి సంకటాలకు గురి చేస్తున్నారు.

మానవుడి దృష్టి ఎలా వుంటుందో చెప్తాను. సాలగ్రామం వుందనుకోండి. రోహిదాసు దానిని స్వీకరించి అందులో ఆ ప్రభువుని దర్శించాడు. మరి సామాన్య మానవుడికి అది ఒక బొమ్మ రాయిలాగా కనిపిస్తుంది. అక్షర జ్ఞానం లేని పసిబాలుడి చేతికి ఒక విలువైన డాక్యుమెంటు ఇచ్చారనుకోండి. ఆ బాలుడు దాని విలువ గుర్తించ గలుగుతాడా! అంత ఎందుకు? తిరుపతి వేంకట రమణుని ఒక శిలా విగ్రహంగా దర్శిస్తే అందులో దివ్యత్వము ఎలా గోచరిస్తుంది చెప్పండి? అదే నిజమైన భక్తుడైతే ఆ శిలా విగ్రహంలోనే తన మనస్సుని నిలిపి కమనీయ ఆకృతిని దర్శిస్తూ 'ప్రభూ భక్తులను తరింపచేయటానికి ఈ రూపం దాల్చి వచ్చావా?' అని భక్తి పారవశ్యంతో మైమరచిపోతాడు. భగవంతుడంటే ఏమరుపాటు ఉన్న వాడు అటువంటి అనుభూతిని పొందగలుగుతాడంటారా?

- సశేషం

(గత సంచిక తరువాయి) # యోగవాశిష్ఠము - సుషుమ్నా ప్రసాద

అతను తన స్వగృహములో యేదో వ్యాధితో చనిపోయినట్లు గ్రహించాడు, అతను తన మిత్రులు, బంధువులందరూ, అక్కడ చేరి తన దేహానికి పక్కనచేరి విలపిస్తున్న దృశ్యాన్ని చూశాడు. అంతేగాక తన భార్య అతని పాదాల వద్ద కూర్చొని, కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న దృశ్యం చూచాడు. తన తల్లి అంతులేని దుఃఖంతో కుమారుని దేహాన్ని ఆలింగనము చేసుకొని, విలపించే దృశ్యంచూచాడు దుఃఖితులైన బంధువులు, అతని దేహమునకు స్నానము చేయించి, అంతిమ కార్యక్రమాన్నంతా చేయడానికి కంత్యక్రియలు నిర్వహించటానికి సంసిద్ధులై శరీరము దహనం చేయటం కూడా చూశాడు. ఆ విధంగా గాధి తటాకములోని నీటి మధ్య నిలబడి, తన దహన క్రియలను దర్శించాడు, అలా తటాక జలమందు నిలిచి మనసు చేసే మాయా క్రియలను దర్శించాడు.



"గాధి (స్వప్నస్థితిలో) భూటాన్ సమీపములో వున్న ఒక గ్రామములో కారు నలుపుగా వుండే ఒక ఛండాల స్త్రీకి, కొడుకుగా జన్మించాడు అతనికి పదహారేళ్ల ప్రాయము వచ్చింది. అతను కూడ తన తల్లిలా వర్షకాలంలోని దట్టమైన మేఘంలా నల్లగా వున్నాడు, అతను ఛండాల కులములో జన్మించిన వొక అమ్మాయిని వివాహమాడి, ఆమెతో ఆనందంగా కాలం గడుపుతున్నాడు, అతనికి చాలా మంది పిల్లలు పుట్టారు. అతను వృద్ధుడైనాడు, తాటాకులతో, గడ్డితో వొక కుటీరము నిర్మించుకొని, అక్కడ వొక తపస్విలా నివసించాడు. అతని కుటుంబ సభ్యులంతా మృత్యువాత పడ్డారు, తానొక్కడే జీవించివున్నాడు.

"అతను వొంటరితనానికి విసిగిపోయి, అనేక దేశాలు తిరిగాడు. అలా సంచరిస్తూ, చివరకు 'కీర' యనే సంపన్న నగరానికి చేరాడు. అతను రాజవీధిలో వెళ్తున్నాడు, కీర దేశపు రాజు అప్పడే మరణించాడు, అతనికి సంతతిలేదు, అక్కడి ప్రజలా దేశాచారమును పాటిస్తూ, వొక ఏనుగును మణులతో, చక్కని పట్టు వస్త్రముతోనలంకరించి, రాచవీధులలో స్వేచ్ఛగా విహరించటానికి వదిలారు. ఆ గజము రాజును ఎన్నుకోవాలి, ఈ ఛండాల వ్యక్తి యెంతో కుతూహలంతో ఏనుగు వంక చూస్తున్నాడు. ఆ యేనుగతని

వద్దకు వచ్చి, తన తొండముతో, అతనిని యెత్తి, తనపై కూర్చుండపెట్టుకొంది. ప్రజలంతా తప్పెట్లు మ్రోగించి, వాయిద్యాలు వాయిస్తూ, అష్టదిక్కుల నుండి, ఆనందముతో కేరింతలు కొట్టూ, "జయహో రాజా" అంటూ, జయ జయ ధ్వానాలు చేశారు. అంతఃపురములోని, అందమైన రాణులు, ఆయనను నగలతో, అలంకరించి, పూలమాలలు వేశారు, అతనిని సింహాసనముపై, దేశాధిపతిగా కూర్చుండబెట్టారు. మంత్రులు, సేనాధిపతులాతని ఆధిపత్యమునకు మోకరిల్లి, ఆజ్ఞలను స్వీకరించారు, రాజుగా అతని పేరు గవల. ఆ కీర రాజ్యమునతడు ఎనిమిది వత్సరాలు పరిపాలించాడు. ఒక రోజు గవల రాజు, తన ఆభరణాలన్నిటిని తీసివేసి, రాజ ప్రాసాదమునకు పక్కనున్న వీధిలో కాలినడకన వెళ్ళాడు. అక్కడ వొక అంటరాని జాతి బృందము సంగీత, వాయిద్యములు వాయిస్తున్నారు.

ఆ బృందమునకు నాయకుడు నడిచి వస్తున్న కీరదేశపు రాజును చూడటం తటస్థించింది వెంటనే అతనిని తనకు పూర్వాశ్రమములో చిరపరిచితుడగ గుర్తించి బిగ్గరగా పిలిచాడు. "ఓ! కటంజా! నీవిక్కడున్నావేమిటి? నిన్ను చాలా కాలంతర్వాత చూస్తుంటే, చాలా ఆనందంగావున్నది. నీకు సంగీతంలో వున్న ప్రావిణ్యం చూచి, రాజుగారు నిన్ను ఆస్థానంలో సేవకుడుగా తీసుకొన్నారా?" అని ప్రశ్నించాడు.

- సశేషం

## పెదనింద్రకొలను శాఖలో కార్యక్రమాలు

సెప్టెంబర్ 2015

5 శనివారం శ్రీకృష్ణాష్టమి రాత్రి 7గం.లకు శ్రీసద్గురుపాదపూజ.

7 సోమవారం శ్రీగురుదశమి రాత్రి 7గం.లకు శ్రీసద్గురుపాదపూజ.

అక్టోబర్ 2015

7 బుధవారం శ్రీగురుదశమి. రాత్రి 7గం.లకు శ్రీసద్గురు పాదపూజ.

19 సోమవారం మూలానక్షత్రం నుండి 22 గురువారం విజయదశమి వరకు ఉదయం 11గం. శ్రీకాళీమాత సహస్రనామార్చన, అనంతరం తీర్థ ప్రసాదములు. విజయదశమి రోజు భక్తసమారాధన.

24 శనివారం - రాత్రి 7గం.లకు శ్రీసద్గురు పాదపూజ.

వివరాలకు : శ్రీ నరసింహారావు సెల్ - 94912 22652,
శ్రీ ఎన్. సుబ్బరాజు సెల్ - 94403 77399

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

సెప్టెంబర్ 2015

5 శని : టీచర్స్‌డే; శ్రీకృష్ణాష్టమి - ఉదయం కలశస్థాపన, శ్రీరాధాకృష్ణ సహస్రనామార్చన, భక్తసమారాధన, రాత్రి 7గం.లకు శ్రీసద్గురుపాదపూజ.

6 ఆది : ఉదయం 11గం. శ్రీరాధాకృష్ణుల సామూహిక పూజలు, భక్తసమారాధన

7 సోమ : శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన, రాత్రి 8గం.లకు ఉట్టి కొట్టుట.

11 శుక్ర : మాసశివరాత్రి. పావులూరు బ్రాంచిలో ఏకాహం.

13 శని : అమావాస్య

17 గురువారం శ్రీ వినాయక చవితి

తె॥జా 5-30ని॥లకు శ్రీసద్గురుపాదపూజ; ఉదయం 11గం. సామూహిక గణపతిపూజలు; భక్తసమారాధన

28 సోమవారం పూర్ణిమ

ఉదయం 11గం. శ్రీసద్గురుపాదపూజ

అక్టోబర్ 2015

7 బుధ : శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

10 శని : శనిత్రయోదశి

11 ఆది : మాసశివరాత్రి, పావులూరు బ్రాంచిలో ఏకాహం.

12 సోమ : అమావాస్య

13 మంగ నుండి 24 శని వరకు శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు.

19 సోమ : మూలనక్షత్రం - సరస్వతీ పూజ

21 బుధః దుర్గాష్టమి; మహర్నవమి - శ్రీజగన్మాత సామూహిక కుంకుమ పూజలు.

22 గురు : విజయదశమి - శ్రీజగన్మాతసామూహిక కుంకుమ పూజలు, అన్నప్రాసనలు, అక్షరాభ్యాసాలు

23 శుక్ర : ఏకాహం

24 శని : దీక్షావిరమణ, రాత్రి 7గం.లకు జగన్మాత నగరోత్సవం, 8గం. శ్రీసద్గురుపాదపూజ

27 మంగళ : ఆశ్వయుజ పౌర్ణిమ - శ్రీమాతాజీవారి జన్మదిన వేడుకలు, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

# పరిప్రశ్నేన సేవయా - పరాశర ప్రసాద్

'బ్రహ్మజ్ఞానికి ఒకదానిపైనే ఆశ' అనే పాట పాడమని, ఆ పాట వింటూ సద్గురుదేవులు వ్యాఖ్యానిస్తూ "ఏమిటయ్యా! అలా పాడావు? చాలా విచిత్రంగా వుందే! శ్రీ శంకర భగవత్పాదుల వారు ఆశలేనివాడు, గొప్పవాడు అన్నారు కదా! మరి బ్రహ్మజ్ఞానికి ఆశ వుంటే ఆయన



గొప్పవాడు ఎలా అవుతాడు? ఆయనకు ఆశ వుంటుందా?" అని ప్రశ్నించి, తమ ప్రసంగాన్ని కొనసాగిస్తూ ..... "బ్రహ్మజ్ఞానికి తాను పొందే ఆనందం అందరూ పొందాలన్నదే ఆయన ఆకాంక్ష అదే ఆయన ఆశ. అది ఆయన ప్రగాఢమైన వాంఛ. అయ్యో! వీరంతా ఎంత బోధ చేసినా ప్రాపంచిక కోర్కెలు జయించలేక, మాయా ప్రలోభితులై బ్రహ్మానందాన్ని కోల్పోతున్నారన్నదే ఆయన ఆవేదన. అంతేగాని, బ్రహ్మజ్ఞాని ధనధాన్యాలు, భోగభాగ్యాలు కోరుకుంటాడా?"

శ్రీబాబు ఇంకా మాట్లాడుతూ "బ్రహ్మజ్ఞానికి లేదు వినాశము- అంటే ఆయన జనన మరణాలు లేనివాడని అర్థం. బ్రహ్మజ్ఞాని సదా సదా జాగరూకుడు - అంటే మృత్యువు ఎప్పుడు వస్తుందా? మృత్యుదేవతలు వచ్చి ఎప్పుడు ప్రాణాన్ని కబళిస్తారా అని జాగకరూకత వహిస్తున్నారని యెన్నడూ లేదు. బ్రహ్మజ్ఞాని సదా తన స్వస్వరూప అనుసంధానంలో వుంటారు అని. అదే ఆయన యెరుక లేక జాగరూకత. అంతేకాని ఆయన దేహం ఎప్పుడు త్యాగం చేయవలసి వస్తుందా అని భీతి చెందుతారా?

ఆయన దేహాన్ని స్వచ్ఛందంగా త్యాగం చేయగల సమర్థులు. ఆయనకు మృత్యుభయం వుండదు. దీనిని అర్థం చేసుకోగలిగితే, బ్రహ్మ జ్ఞాని అంటే యెవరో, ఆయన ఆశయం యేమిటో తెలుసుకో గలుగుతారు. స్వామి సన్నిధిలో వుండటం అంటే దేహం కాదు వుండవలసినది. మానసికంగా స్వామికి చేరువ అవ్వాలి. ఆయన ఆశయానికి తగినట్లుగా నడచుకునే శిష్యుడే ధన్యుడు" అన్నారు.

# సందేహింపకు సుమ్మీ!

- పెనుమాక నాగేశ్వరరావు

సందేహింపకము సుమ్మీ గురునాధు ప్రేమనూ సుమ్మీ
ఒకే భావమూ, ఒకే రూపమూ, ఒకటే నామము
మిన్నే విరిగి మీద పడినా సడలని భక్తిని
ఆ పాదము వదలని శక్తిని యిమ్మని ప్రార్థింపుము సుమ్మీ ॥సందే॥

అవ్యాజ ప్రేమను అనుమానించిన నాడు
చేసిన పూజలు, సేవలు, మన జన్మలే వృధాయగు సుమ్మీ
ఒకే సన్నిధి, ఒకే పెన్నిధి, ఒకే పాదము, అదే వేదము
సకలము తెలిసియు చూసియు తప్పులు సేవయకుమీ ॥సందే॥

ఆచార్యదేవుని అనురాగమే అనంతము సుమ్మీ
ఆ పద పూజలతో తరియింతుము సుమ్మీ
నమ్మినవారికి బంగారు పిచ్చుకే సుమ్మీ
చెడినవారు లేనేలేరు గురువును నమ్మీ ॥సందే॥



(గత సంచిక తరువాయి) **గీతాధ్యయనమ్** - రమణ ప్రసాద్

ఈ విధంగా కర్మషట్కం ముగించి, భగవానుడు భక్తిషట్కం ప్రారంభించాడు.

## అక్షర పరబ్రహ్మయోగము



ఇది విన్న అర్జునునకు సందేహం కలిగి యిలా ప్రశ్నించాడు ..... 1. బ్రహ్మ అనగా యేమి? 2. అధ్యాత్మం అనగానేమి? 3. కర్మ మనగా యేమి? 4. అధిభూతమనగానేమి? 5. అధిదైవము అని దేనిని అందురు? 6. అధియజ్ఞుడు యెవరు? 7. కథం జ్ఞేయోऽసి? - ఎలా తెలిసికొనబడతావు? ఈ సందేహాలకు భగవంతుడు యిలా సమాధానం యిచ్చాడు...

సర్వోత్తమము, నాశరహితమైనది - బ్రహ్మము.

ఆత్మ పరమాత్మ తత్త్వము - అధ్యాత్మము.

సమస్త జీవుల వుత్పత్తికి, వునికికి కారణం అయిన కార్యమే - కర్మ.

నశించే స్వభావంగల శరీరాదులు - అధిభూతం.

పురుషుడే - అధి దైవం.

దేహంలో అంతర్యామి రూపంలో వుండే - అధియజ్ఞం నేనే.

ఏడవ ప్రశ్నకు సమాధానంగా ..............

అంతకాలే చ మామేవ స్మరన్ ముక్త్వా కళేబరమ్।
యః ప్రయాతి సమద్భావం। యాతి నాస్త్యత్ర సంశయః॥ 5

మరణ సమయంలో నన్నే స్మరిస్తూ శరీరాన్ని విడిచేవాడు నా స్వరూపాన్నే పొందుతాడు. ఇందులో యే మాత్రం సందేహం లేదు.

**యం యం వాऽపి స్మరన్ భావం। త్యజత్యంతే కళేబరమ్।**
**తం తమేవైతి కౌంతేయ! సదా తద్భావ భావితః॥ 6**

అంత్యకాలంలో యెవడు యే భావంతో శరీరాన్ని వదులుతాడో, ఆ బావాలకు తగిన స్థితినే పొందుతాడు.

**తస్మాత్సర్వేషు కాలేషు। మామనుస్మర యుధ్యచ।**
**మయ్యర్పిత మనోబుద్ధిః। మామేవైష్యస్య సంశయః॥ 7**

అందువల్ల సర్వకాలములలో నన్నే స్మరిస్తూ యుద్ధం (కర్మ) చెయ్యి. మనస్సు బుద్ధి నాకే అర్పిస్తే నన్నే పొందుతావు.

ప్రయాణకాలే మనసా చలేన। భక్త్యా యుక్తో యోగబలేన చైవ।

భ్రువోర్మధ్యేప్రాణ మావేశ్యసమ్యక్। సతం పరం పురుష ముపైతి దివ్యమ్ 10

అంత్యకాలంలో యోగబలం చేత (ధ్యానాభ్యాసాది సంస్కార బలంతో) ప్రాణవాయువును భ్రూమధ్యం (కనుబొమల నడుమ) బాగుగా నిలిపి, సర్వజ్ఞుడు, జగన్నియామకుడు, అణువు కంటె సూక్ష్మమైనవాడు, అయిన పరమాత్మను అంత్యకాలంలో ఎవడు నిశ్చల మనస్సుతో చింతిస్తాడో అతడు ఆ పరమాత్మనే పొందుతున్నాడు.

అంత్యకాలంలో యే రీతిగా పరమాత్మను ధ్యానించవలెనో చెప్ప బడింది - 1. భక్తితో కూడి, 2. యోగబలంచే ప్రాణవాయువును లేక దృష్టిని భ్రూమధ్యంలో నిలిపి నిశ్చల మనస్సుతో పరమాత్మను ఎడతెగకుండా ఓంకారమనే ప్రణవమంత్రాన్ని ధ్యానించాలి. అలా ధ్యానం చేసినవాడు ఆ దివ్యపురుషుణ్ణి (భగవంతుణ్ణి) పొందుతాడు.

శాశ్వతమైనది, బ్రహ్మచర్యాన్ని పాటిస్తూ కోరేది, కామక్రోధాలను జయించిన యతులు కోరే ఆ పరమపదాన్ని గురించి నీకు చెబుతాను.

సర్వద్వారాణి సంయమ్య। మనో హృది నిరుధ్యచ।
మూర్ధ్న్యాధాయాత్మనః ప్రాణం। ఆస్థితో యోగధారణమ్॥ 12
ఓమిత్యేకాక్షరం బ్రహ్మ వ్యాహరన్ మామనుస్మరన్।
యః ప్రయాతి త్యజన్ దేహం। స యాతి పరమాం గతిమ్॥ 13

ఎవడు ఇంద్రియాలను బాగా అరికట్టి, మనస్సును హృదయ మందు (ఆత్మయందు) నిలిపి, శిరస్సునందు (బ్రహ్మరంధ్రమునందు) ప్రాణవాయువును నిలిపి, ఆత్మ చింతన గలవాడై, పరబ్రహ్మ వాచకమైన 'ఓమ్' అనే అక్షరాన్ని వుచ్ఛరిస్తూ వుంటాడో అతడు మోక్షాన్నే పొందుతాడు. ఎవడు ఆ విధంగా అనన్య చిత్తంతో నిరంతర చింతనచేస్తాడో అతనికి నేను సులభంగా పొందబడుతాను.

బ్రహ్మదేవునికి వేయి యుగాలు ఒక పగలని, వేయి యుగాలు ఒక రాత్రి అని విజ్ఞులు చెబుతారు. బ్రహ్మదేవుని పగటి సమయంలో చరాచర వస్తువులు (ప్రకృతి నుండి వచ్చినవి) అవ్యక్తంలో కలిసిపోతాయి. అగ్ని, జ్యోతి, శుక్లపక్షము, ఆరునెలల ఉత్తరాయణము, పగటిసమయం- వీటిలో మరణించే ఉపాసకులకు బ్రహ్మప్రాప్తి కలుగుతుంది. పొగ, రాత్రి కృష్ణపక్షము ఆరు మాసాల దక్షిణాయనం -వీటిలో మరణించినవాడు చంద్రజ్యోతిని పొంది మానవలోకానికి వస్తాడు. దీనిని గ్రహించిన యోగి వేదములు, యజ్ఞాలు, దానముల వలన కలిగే పుణ్యఫలాలను అధిగమించి అనాదియైన పరమపదాన్ని పొందుతాడు.

- సశేషం

# శ్రీకృష్ణ కర్ణామృతము

(గత సంచిక తరువాయి)

- సుశీలా ప్రసాద

42. కిమివ శృణుమః కస్యబ్రూమః కథం కృతమాశయా।
కథయత కథం ధన్యామహ్యేమన్యామహే హృదయేశయమమ్॥
మధుర మధురస్మే రాకారే మనో నయనోత్సవే।
కృపణ కృపణా కృష్ణే తృష్ణా చిరంబత లమ్బతే॥

తాత్పర్యము -



సుందరమైన రూపము, మధురమైన చిరునవ్వుతో మనస్సుకి కళ్ళకి కూడా పండుగజేసే నా హృదయేశుడైన శ్రీకృష్ణుణ్ణి దర్శించాలనే దీనమైన ఆశ చాలాకాలం నుండి నా మనస్సులో తగలుకొని ఎటూ మరలకుండా వుంది. ప్రపంచ విషయాదులు, సంకల్పాల యందు విముఖమై వుంది. ఈ నా హృదయవేదన ఎవరికి చెప్పాలి? ఇతరులకు చెబితే వారు అర్థం చేసుకోలేక హేళన చేస్తారేమో! ఏ శాస్త్రాలు, పురాణాలు చదివేది? అవి కేవలం పరమాత్మ గుణ గణాలను వర్ణించగలవేగాని, పరమాత్మని దర్శింపజేయలేవు కదా! ఈ హృదయవేదనను కనిపెట్టే విధం యేది? ఎవరి వుపదేశం వినాలి?

సర్వసమర్థుడైన గురుమూర్తిని ఆశ్రయించి, వారి వుపదేశం వింటే నా ఆశ తప్పక సఫలం అవుతుంది. ఎందుకంటే వారు ఆత్మజ్ఞాన సంపన్నులు కదా! ఆత్మతత్త్వం తామే అయినవారు కనుక తరించే మార్గాన్ని వారు తప్పక చూపగలరు. మనస్సులో వున్న వాడిని మనస్సుతో యెలా చూడగలను? అనుకుంటే హృషీకేశుడైన వాడికి (ఇంద్రియాలకు అధిపతియైనవాడు) సర్వం ప్రసాదించే శక్తి వుంది కనుక తానే దారి చూపగలడు. నీలో ప్రకాశించేది ఆత్మతత్త్వమే కనుక నీకు ఆత్మకు భేదం లేదనే జ్ఞానాన్ని బోధించి, అనుభవపూర్వకంగా దాన్ని తెలియజేస్తారు. శ్రీలీలాశుకులు పై శ్లోకంలో మనస్సులో నిలిచిన మనోనాథుడిని దర్శించేందుకు ఆవేదన పడుతున్న సాధకుని స్థితిని వర్ణించారు.

శ్రీ సద్గురు సమాశ్రయంతో ఆత్మానందామృతానుభవాన్ని పొంది సాధకుడు బ్రహ్మానందం అనుభవించగలడని నిశ్చయంగా చెప్పగలము.

- సశేషం

# యోగేశ్వరుడు-విఘ్నేశ్వరుడు

- రమణ ప్రసాద్

వాతాపి గణపతిం భజే హం వారణాస్యం వరప్రదం ॥వాతాపి॥
భూతాది సంసేవిత చరణం - భూత భౌతిక ప్రపంచ భరణం
వీతరాగిణం వినుత యోగినం - విశ్వ కారణం విఘ్న వారణం ॥వాతాపి॥
పురా కుంభవ సంభవ ముని వర ప్రపూజితం - త్రిలోక మధ్యగతం
మురారి ప్రముఖాద్యుపాసితం - మూలాధారా క్షేత్ర స్థితం
పరాది చత్వారి వాగాత్మకం - ప్రణవ స్వరూప వక్ర తుండం
నిరంతరం నిఖిల చంద్ర ఖండం - నిజ వామ కర విద్రుతేక్షు దండం
కరాంబుజ పాశ బీజాకారం - కలుష విదూరం భూతాకారం
అనాది గురు గుహ తోషిత బింబం క్ష హంసధ్వని భూషిత హేరంభం
॥వాతాపి॥

వాతాపిలో (గుజరాత్‌లో) స్థితుడైన పరబ్రహ్మ స్వరూపుడైన గణపతిని నేను భజించుచున్నాను. ఏనుగు ముఖం కలవానిని, సమస్త జీవరాసులను పరిపాలించువానిని, వరప్రదుడైన గణేశుని సేవిస్తున్నాను. పంచ భూతములు సేవించే చరణాలు కలవాడు, సర్వ విఘ్న నివారకుడు, సంకల్పములను జయించినవాడు, మునిగణములచే పూజింపబడే వాడు, సమస్త సృష్టికి కారణ భూతుడు, సర్వ విఘ్న నివారకుడు అయిన గణనాధుని కొలుచు చున్నాను. అగస్త్యమునిచేత పూజింప బడేవాడు, శ్రీచక్రము మధ్య స్థితుడైనవాడు, విష్ణువు మొదలైన ప్రముఖులచేత వుపాసింపబడే వాడు, మూలాధార చక్రమునందు స్థితుడైనవాడు, పర మొదలైన నాలుగు వాక్కులయందు ఉన్నవాడు (పర , వైఖరి, మధ్యమ, పశ్యంతి), ప్రణవ స్వరూపుడు,



ఓంకార రూపములో తొండము ఎడమవైపునందు ఉన్నవాడు, చంద్రవంకను నిరంతరం శిరమున ధరించినవాడు, చేతిలో చెఱకు గడ కలవాడు అయిన స్కందపూర్వజుని ప్రార్థించుచున్నాను. పద్మముల వంటి చేతులలో త్రాడు, దానిమ్మ ఫలము కలవాడు, పెద్ద ఆకారము కలవాడు, కలుషవిదూరుడు, సదా శివునికి, సుబ్రమణ్యస్వామికి ఆప్తుడు, హంసధ్వని రాగంతో కొనియాడబడేవాడు అయిన హేరంభుని అర్చించుచున్నాను.

శ్రీగణేశుడు ఎడమవైపున ఉన్న తొండముతో మోదకమును పట్టుకున్నట్లు మనం చూస్తాము. మోదకము భోగములకు ప్రతీక - భక్తులకు భోగములను అందిస్తాడు. అంటే వరాలను ప్రసాదిస్తాడు. ఆయన విద్యా ప్రదాత. మోక్ష ప్రదాత. విఘ్న నివారకుడు, శివ సుతుడు, యోగ స్వరూపుడు, పరబ్రహ్మ స్వరూపుడైన గణపతికి భాద్రపద శుద్ధ చవితి నాడు సమస్త మానవాళి పూజలు చేసి ఆయన కృపకు పాత్రులవుతారు.



## 17-9-15 గురువారం శ్రీ వినాయక చవితి

# సుధీర్ - భోక్తా

- కామేశ్వరీ ప్రసాద

ఒక ఊరిలో సుధీర్ అనే భక్తుడుండేవాడు. నిరంతరం భగవత్ ధ్యానంలో నిమగ్నమై ఉండేవాడు. ఏ పనీ చేసేవాడు కాదు. భార్యా బిడ్డలను ఆ భగవంతుడే చూసుకుంటాడు అనే నమ్మకం పూర్తిగా ఉంది. ఆస్తిపాస్థులన్నీ అయిపోయాయి. పూట గడవటం కూడా కష్టం అయిపోయింది. ఏం చేయాలి అనే ఆలోచనతో మరో ఊరుకి బయలు దేరాడు. అక్కడ రామాలయం కనిపించింది.

ఈ రాముడినే నమ్ముకున్నాను అయినా నాకు ఎందుకు కష్టాలు వస్తున్నాయి? రామదర్శనం చేసుకున్నాడు. ఆ గుడిలో ఒక గురువుగారు శిష్యులు కలిసి పూజ చేసుకుంటున్నారు. ఇంతలో తన భార్యాబిడ్డలు జ్ఞాపకం వచ్చారు. 'నావాళ్ళు అన్నం నీళ్ళు లేకుండా ఏడుస్తుంటే, నువ్వు ఇక్కడ కూర్చుని పూజలు చేయించుకుంటూ కులుకుతున్నావా?' అని రాముడితో మాట్లాడుతూ ఆ నగలు తీసుకుని వెళ్ళిపోతున్నాడు. అది చూసిన కొంతమంది శిష్యులు అతన్ని పట్టుకుని గురువుగారి దగ్గరకు పట్టుకువెళ్ళారు.

గురువుగారు సుధీర్‌ని పిలిచి "నాయనా! ఎందుకిలా చేశావు? తప్పుకాదా? సర్వరక్షకుడైన భగవంతుడి ఆభరణాలు దొంగిలించవచ్చా?" అని మందలించాడు. దానికి సుధీర్ "నేను రామచంద్రునితో చెప్పే తీసుకున్నాను" అన్నాడు. గురువుగారు తిరిగి మాట్లాడుతూ "నీ పేరేమిటి?" అని అడిగారు. "సుధీర్" అన్నాడు.

"నాయనా! సుధీర్! నీవు గీతను పారాయణ చేస్తావు కదా? అందులో 'పార్థోవత్స సుధీర్ భోక్తా గీతామృతం మహత్' అని ఉంటుంది. నీలోనే ఉన్న పరమాత్మను తెలుసుకోలేక బయట వెతుకుతున్నావు. పిచ్చివాడా! ఉపనిషత్తులన్నీ గోవుగా చేసి, పార్థుని దూడగా చేసి, పరమాత్మ గీతామృత ధారలు పిండితే వాటిని సుధీరుడు అనుభవించాడు, ఆనందించాడు. కాబట్టి అసలు నీపేరే సుధీర్. చక్కగా నీవెవరో నీవే తెలుసుకో. నీలోనే ఉన్న పరమాత్మను తెలుసుకో. అవగాహన చేసుకో. ఆనందాన్ని పొందు.  జన్మ సార్థకం చేసుకో" అని బోధించారు. తనువును మరచి తనలోనే  ఉన్న చైతన్య స్వరూపుని తెలుసుకొని ఆనందించాడు సుధీర్!

# అమృతబిన్దూపనిషత్

(శ్రీదండి నిర్మలానంద స్వామి వారి బోధ సంక్షిప్తంగా)

(గత సంచిక తరువాయి) సేకరణ - పరాశర ప్రసాద్

అజ్ఞానం అంటే యేమిటి? బ్రహ్మతత్త్వాన్ని తెలుసుకోకుండా అడ్డు పడేది. బ్రహ్మతత్త్వం నీకంటె భిన్నంగా వుంటే కదా! అది వస్తువు కాదు. మరి ఎందుకు తెలియబడటం లేదు? వృత్తి అడ్డుగా నిలుస్తోంది. వృత్తి అంటే యేమిటి? మోక్షమార్గానికి అడ్డుగా నిలిచే విషయాసక్తి. అది తొలగాలి. అలవాటు అయితే విషయాసక్తి తొలగదు. దానిని సాధన ద్వారా నెమ్మది నెమ్మదిగా తొలగించుకోవాలి. అలవాటు అయితే రోగం కూడా భోగమే సుమా. భోగమే రోగాలకు కారణమని భర్తృహరి చెప్పిన విషయం మనకందరకూ తెలిసినదే. దోష దృష్టి ప్రమాదమైనది. నచికేతుడు దోష దృష్టిని వదిలి విషయాదులను తిరస్కరించాడు. దోషదృష్టి మనస్సు యొక్క స్వాభావికము. మంచి గుర్తుకు రాదు, చెడు గుర్తుకు వస్తుంది.

ఏసు ప్రభువు శిష్యులతో సంచారం చేస్తున్నాడు. మార్గమధ్యంలో కుక్క చచ్చిపడి వున్నది. దుర్వాసన వస్తోంది. శిష్యులంతా వస్త్రంతో ముక్కు మూసుకుని నడుస్తున్నారు. ఏసుప్రభువు అక్కడ నిలిచి కుక్కని సమీపించి, శిష్యులతో 'చూశారా! ఈ కుక్క దేహాన్ని త్యజించినా పళ్ళు యెంత తెల్లగా స్వచ్ఛంగా వున్నాయో! దేహం ఎలా వున్నా, మనస్సు అలా శుభ్రంగా మలిన రహితంగా వుండాలి సుమా' అన్నారు.

మనస్సులో కలుషితం వున్నంత వరకూ బ్రహ్మపదార్థం గోచరించదు. మలిన మనస్సుకు అది అందనంత దూరంలో వుంటుంది. విషయాదుల దోష ప్రవృత్తిని ప్రతి సాధకుడూ తెలుసుకోవాలి. మానవుడి ఆయుర్దాయం ఎంత? చాలా స్వల్పం. రావి ఆకు చివర నిలచి వున్న నీటి బిందువు ఎప్పుడు క్రిందపడుతుందో యెవరైనా చెప్పగలరా! మానవుని జీవిత కాలంకూడా అంతే సుమా!

భోగాలు నేను అనుభవిస్తున్నాను అని యెవరైనా భావిస్తే అది తప్పే. భోగాలే నిన్ను అనుభవించి, అనుభవించి పీడించి చివరకు నిన్ను వదిలివేస్తాయి. వట్టిచేతులతో మట్టిపాలు చేస్తాయి. ధ్యాన ప్రక్రియ చాలా గొప్పదే. కాని కళ్ళు మూసుకుని కూర్చున్నంత మాత్రాన చాలదు. ధ్యానంలో

మనస్సు నిర్విషయమవ్వాలి. బ్రహ్మము అచింత్యము, అవ్యక్తము అని యెందుకు అంటున్నారో తెలుసుకోవాలి. బ్రహ్మకు జాతి, నీతి, కులగోత్రాలు లేవు. కాబట్టి అచింత్యము అన్నారు. పంచదార తియ్యగా వుంటుందని నోటితో చెప్పవచ్చు. కాని ఆ పంచదారను నోటిలో వేసుకుని ఆ మాధుర్యాన్ని అనుభవించినవాడి స్థితి అంతకన్న గొప్పగా వుంటుంది.

దేహాన్ని మాంసపిండంగా యెన్నడూ భావించరాదు. అది తప్పు. ఈ దేహము కూడా బ్రహ్మపిండమే. సర్వవ్యాపకంగా ఆత్మవస్తువు వ్యాప్తి చెందియున్న జగత్తు బ్రహ్మము కాక మరేమిటి? బ్రహ్మము చిద్రూపము, అవయవాలు లేనిది, సూక్ష్మమైనది, నిష్కళంకమైనది.

- సశేషం



21-10-2015 బుధవారం దుర్గాష్టమి మరియు మహర్నవమి

# శ్రీ మహాభారత నీతి చంద్రిక

(గత సంచిక తరువాయి) - శ్రీ రామానుజ దాసు

## విదురుడు

(శ్రీ మహాభారత ఆది పర్వంలో విదురుని పూర్వజన్మ వృత్తాంతము)

పూర్వం మాండవ్యుడనే ప్రసిద్ధమైన మహర్షి వుండేవారు. ఆయన సత్యనిష్ఠుడు, తపస్వి. మౌనవ్రతం పాటిస్తూ, తమ ఆశ్రమ ద్వారం దగ్గర గల చెట్టు క్రింద రెండుచేతులు పైకెత్తి, వందనమాచరిస్తూ తపస్సు చేస్తూ వుండేవారు. ఒక రోజు రాజ్యంలో రాజు యొక్క ధనాన్ని దొంగిలించిన దొంగలు, తలారులు తమను వెంటాడుతుంటే పరిగెడుతూ మాండవ్యుని సమీపంలో సొత్తు పడవేసి దాక్కొన్నారు.

భటులు ఆశ్రమ సమీపానికి వచ్చి, సొమ్ములు మాండవ్యుని సమీపంలో పడివుండటం వలన దొంగలు యెటువెళ్ళారో చెప్పమన్నారు. మౌన వ్రతము ఆచరిస్తుండటం వలన మహర్షి బదులు పలుక లేదు. రాజభటులు ఆశ్రమమంతా వెతికి దొంగలను పట్టుకున్నారు. ధనము, దొంగలతోపాటు మహర్షిని కూడా బంధించి రాజు దగ్గర ప్రవేశపెట్టారు. రాజు ఆ దొంగలను చంపించి, మహర్షిని మునివేషంలో వున్న దొంగగా భావించి, నగరం వెలుపల శూలానికి కొరత వేయమని ఆజ్ఞాపించాడు.

భటులు రాజాజ్ఞ ప్రకారం శూలారోహణం చేయించారు. ఎన్ని రోజులు గడిచినా, ఆహారం లేకపోయినా కూడా మహర్షి జీవించే వున్నారు. రాత్రి సమయంలో ఋషులు పక్షుల రూపంలో వచ్చి తమ దుఃఖాన్ని వెల్లడి చేశారు. 'మీరు యింతటి శిక్షను అనుభవించటానికి మీరు చేసిన అపరాధమేమిటి?' అని ప్రశ్నించారు. 'ఇదంతా నా అపరాధ ఫలితమే. దీనికి దోషులుగా నేనెవరిని నిర్ణయించేది?' అన్నారు మహర్షి.

మాండవ్యుడు దోషం దొంగలది అనిగాని, రాజుదనిగాని, భటులది అనిగాని చెప్పకుండా తనదే అనటంతో ఆయన గొప్పతనం తెలుస్తోంది. మనం అనుభవించే దుఃఖాలకు పురాకృత జన్మ దోషాలే తప్ప వ్యక్తులు కాదుకదా! వ్యక్తులను కారణంగా భావించినవాడు తన దోషాలను గుర్తించలేడు. దోషాలను గుర్తించినవాడు సర్వం నారాయణ దివ్య అనుజ్ఞ ప్రకారమే జరుగుతుంది అని దైవమును గుర్తిస్తారు.

మాండవ్యుడు ఋషులతో మానవుడు తాను చేసిన పుణ్య, పాప కర్మల ఫలితంగా సుఖమో, దుఃఖమో అనుభవిస్తూ వుంటాడు. తన కర్మలకు తానే కారకుడౌతాడు అని జవాబిచ్చారు.

ఈ సంభాషణ నగరాన్ని రక్షించే భటుడు విని రాజుతో చెప్పాడు. ఆ రాజు అతను నిజంగా మహర్షే అని గుర్తించి, వెంటనే బయలుదేరి శూలానికి గుచ్చబడిన మాండవ్యుని దగ్గరకు వెళ్ళి, 'అయ్యా! నన్ను క్షమించండి. అజ్ఞానంతో మిమ్మల్ని అపరాధిగా భావించి కొరత వేయించాను. నా యీ తప్పును మన్నించి, నన్ను అనుగ్రహించండి' అని వేడుకున్నాడు. రాజభటులు అతన్ని శూలం నుండి దించబోగా శరీరం నుండి శూలం వేరుకాలేదు. శూలమును అంతవరకు ఖండించగా మిగిలిన భాగం శరీరంలో వుండిపోయింది. అప్పటి నుండి ఆయనను "ఆణి మాండవ్యుడు" అని పిలిచేవారు.

మహాతపస్సుతో లోకాలన్నీదాటి ఒకనాడు యముని నగరానికి వెళ్ళిన మహర్షి యమునితో ' యమధర్మరాజా! నేను ఎలాంటి పాపం చేశానని, నాకు యిలాటి శిక్ష విధించావు?' అని అడిగాడు. దానికి యమడు సమాధానం చెబుతూ 'మహర్షీ! మీరు బాల్యంలో తూనీగలు పట్టి బంధించి, వాటి తోకలో ముల్లును గుచ్చి వినోందించారు. చిన్న దానం చేస్తే అనేక రెట్లు ఫలితం కలిగినట్లే, అధర్మం కూడా చిన్నదయినా, ఫలితం ఎన్నోరెట్లు అనుభవించాలి. మీరు చేసిన పనికి యీ శిక్ష విధించ వలసి వచ్చింది' అన్నాడు.

అప్పుడు మాండవ్యుడు "పన్నెండు సంవత్సరాల వయస్సు వచ్చే వరకు బాలుడికి యే పని చేసినా అధర్మం కాదు. ఎందుకంటే అతడికి ధర్మాధర్మ జ్ఞానం వుండదు. నీవు చిన్న అపరాధానికి నాకు పెద్దశిక్ష వేశావు. కాబట్టి భూలోకంలో నీవు శూద్రయోని యందు పుడతావు! ఈ రోజు నుండి లోకంలో కర్మఫలాన్ని గురించి ఒక నియమాన్ని స్థాపిస్తున్నాను. పన్నెండేళ్ళ ప్రాయం వరకు చేసిన కర్మఫలాల యొక్క పాపం అంటదు. ఆ పైన చేసిన కర్మల ఫలం మాత్రం అనుభవించాల్సి వుంటుంది" అన్నారు.

మాండవ్య మహర్షి శాపం వలన భూలోకంలో శూద్ర స్త్రీకి విదురునిగా పుట్టినవారే యమధర్మరాజు!!

\- సశేషం

# త్యాగాచ్ఛాన్తిరనన్తరమ్

- పాలూరి కాళీప్రసాద్

మనం పూజలు కానీ, వ్రతాలు కానీ, జపం కానీ రోజూ చేసుకునే అలవాటు ఎలా అభ్యాసం అయితే అలా చేసుకుంటూ వెళ్ళిపోతాము. అయితే కేవలం అభ్యాసంగా కాకుండా వాటిలోని అర్థం తెలుసుకుని చేయటం ఉత్తమమని 'శ్రేయోహి జ్ఞానమభ్యాసాత్' అని భగవద్గీత బోధిస్తున్నది. దీనినే 'తెలిసి రామచింతన చేయ'మని శ్రీ త్యాగరాజ స్వామి వారు బోధించారు.

అయితే కేవలం అలా అర్థం తెలుసుకున్నంత మాత్రాన చాలదు. దానిమీద నీ మనస్సు నుంచి ధ్యానించాలి అని 'జ్ఞానాత్ ధ్యానం విశిష్యతే' జ్ఞానము కంటె కూడా ధ్యానం శ్రేయము అని భగవద్గీత చెబుతోంది.

కానీ, అర్థం తెలుసుకుని, ధ్యాస నిలిపి సత్కర్మలు ఆచరించినా, వాటిని ఏదో ప్రయోజనం ఆశించి చేయటం వలన అవి కామ్యకర్మలుగా మారి చివరికి బంధాన్ని కలిగిస్తాయి. అందుకనే ధ్యానం కన్నా కూడా కర్మఫల త్యాగమే గొప్పదని 'ధ్యానాత్ కర్మఫలత్యాగమ్' అని చెప్పబడింది.

ఇక అలా ఫలితాన్ని భగవంతునికే విడిచిపెట్టి సత్కర్మలను ఆచరించటం వలన మనకు శాశ్వతమైన శాంతి లభిస్తుంది. దీనినే 'త్యాగాచ్ఛాన్తిరనన్తరమ్' అని భగవద్గీత నొక్కి వక్కాణిస్తోంది.

శ్రీగురుదేవులు బాబూజీ మహరాజ్ ఎప్పుడూ చెబుతూ వుండేవారు - "చెరువు దగ్గరకు ఒక గ్లాసు తీసుకువెడితే నీకు గ్లాసుడు నీళ్ళే వస్తాయి. అలాగే చెంబు తీసికెళ్ళినవాడికి చెంబుడు నీళ్ళే వస్తాయి. బిందె తీసుకెళ్ళినవాడికి బిందెడు లభిస్తాయి. కానీ ఏమీ తీసుకెళ్ళకుండా తానే వెళ్ళి ఆ చెరువులో మునిగిన వాడికి చెరువంతా తనదే అవుతుంది. చూశారా! ఫలితాన్ని ఆశించనివాడికి ఎంతటి ఫలితం దక్కుతుందో! ఇక వాడికి మనసులో అశాంతికి తావెక్కడిది?"

త్యాగాచ్ఛాన్తిరనన్తరమ్!

# అమెరికా పర్యటనలో శ్రీ మాతాజీ బోధ

- రమణ ప్రసాద్

3 -7-2015

మహాత్ములు ఏమని హెచ్చరిస్తున్నారంటే మనం గుర్తించ వలసినది ఒకటి ఉన్నది అని. అదే బ్రహ్మ పదం. కాని మనం దానిని గుర్తించకుండా ప్రపంచ విషయాలలో ప్రాకులాడుతున్నాం. ఈ జగత్తు కూడా ఏదో ఆధారం ఉండబట్టే ప్రకాశిస్తోంది. అదే చైతన్యం. 'దారాపుత్రుల ప్రేమ అస్థిరము, భగవానుని ప్రేమ సుస్థిరము' అన్నారు శ్రీగురుదేవులు. అట్టి కళంక రహితమైన ప్రేమ మనకు శ్రీ గురుదేవుల వద్దనే లభిస్తుంది.

గురుదేవుని వద్ద ఎలా మెలగాలో శ్రీరాముడు ఆచరించి చూపించాడు. విద్యాభ్యాసానికి రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులు వసిష్ఠాశ్రమానికి వెళ్ళారు. రాముడు రోజూ ఆశ్రమం శుభ్ర పరచటం, మొక్కలకు నీళ్ళు పట్టడం గురుమాత అయిన అరుంధతి గమనించి, సమయం చూసి వసిష్ఠులవారితో, 'స్వామీ! రాముడు ముక్కు పచ్చలారని రాకుమారుడు. అతడు ఆశ్రమంలో అన్ని పనులూ చేస్తుంటే నాకు చాలా జాలి కలుగుతున్నది' అన్నది. వసిష్ఠులవారు చిరునవ్వుతో 'దేవీ! రాబోయే కాలంలో రాముడు ఎటువంటి ప్రదేశాలలో సంచరిస్తాడో, ఆ పరిస్థితులను తట్టుకొనేందుకు తగిన శిక్షణ ఇస్తున్నాను' అని సెలవిచ్చారు.

తల్లి తండ్రులను విడిచి వచ్చిన బాలురను నిద్ర పుచ్చుదామని వచ్చిన అరుంధతి నిర్ఘాంతపోయింది. అక్కడ రాముడే ఆ బిడ్డల తల్లి రూపాలను ధరించి జోల పాడుతున్నాడు. ఆ సన్నివేశాన్ని మీరు ఊహించుకోండి. వారిలో మనం కూడా ఉండే ఉంటాం. శ్రీగురుదేవుల వద్ద మనం అట్టి ప్రేమను పొందుతున్నాం.

'కాకే ద్వారే జాయ్ సిర్ నావూఁ' అని ఒక కీర్తనలో సూరదాసు, 'ప్రభూ! నిన్ను విడిచి ఎవరి ముందు శిరస్సు వంచేది? నిన్ను విడిచి ఎలా మనగలను? అని మొర పెట్టుకొంటాడు. 'నాకు నీ అభయపదాన్ని

యివ్వవయ్యా! అంత్యకాలంలో నీ స్మరణే నాకు గతి' అని వేడుకుంటాడు.

కృష్ణుడు సూరదాసుకు రోజు పరిచర్యలు చేసేవాడు. ముఖం కడిగించేవాడు, షికారుకు తీసుకువెళ్ళేవాడు. బాసీపట్టు వేసుకొని కూర్చుని" తాతా! ఏదీ మళ్ళీ పాడు ఆ పాట!" అని కీర్తనలను పాడించుకునేవాడు. నాకు పరిచర్యలు చేస్తున్న ఈ బాలుడు ఎవరా? అని ఆలోచిస్తూ, చెయ్యి పట్టుకోబోయాడు. అంతే కృష్ణుడు మాయమయ్యాడు! సూరదాసు, 'హాథ్ ఛుడాకే జాత్ హెూ నిబల్ జానే మోహి। హృదయ్ ఛుడాకే జావోతో సబల్ జానే తోహి ॥ 'కృష్ణా! నన్ను నిర్బలుడిగా భావించి చెయ్యి విడిపించుకొని వెళ్తున్నావు. ఏదీ నా హృదయంలోనించి వెళ్ళ గలిగితే నువ్వు సబలుడవని నమ్ముతాను' అన్నాడు ధీమాగా.

తిరుపతిలో బావాజీ అనే భక్తుడు ఉండేవాడు. ఆయనను అర్చకులు ఆలయంలోనికి రానిచ్చేవారు కారు. బావాజీ ఒక ప్రక్క కూర్చుని నిరంతరం స్వామిని స్మరించేవాడు. వెంకటేశ్వర స్వామి అతని భక్తికి మెచ్చి అతని దగ్గరకు వచ్చేవాడు. అతనితో సంభాషించేవాడు. అతనితో పాచికలు ఆడేవాడు.

ఒకనాడు బావాజీ కోసం బంగారు గిన్నెలో పాయసం తెచ్చి, అతనిచేత తినిపించాడు. ఆ ప్రసాదం చిత్తోపరతి సుఖాన్ని ఇచ్చేది. ఇంతలో సుప్రభాత సేవ మొదలవడంతో బంగారు గిన్నె అక్కడే విడిచి స్వామి హడావిడిగా వెళ్ళిపోయాడు. అర్చకులు ఆలయం తలుపులు తీసి బంగారు గిన్నె కనిపించకపోవటంతో బావాజీని అనుమానించి చెరసాలలో వేశారు. అంతేకాదు బండెడు చెఱకు గడలు అక్కడ పెట్టి తెల్లవారేసరికి ఈ గడలతో చెఱకు రసం తియ్యమని ఆదేశించారు.

బావాజీకి ఎవరు దిక్కు? ఆ దేవ దేవుడే దిక్కు. ఆయనను స్మరిస్తూ కూర్చున్నాడు. స్వామి ఏనుగు రూపంలో వచ్చి ఆ కార్యాన్ని నెరవేర్చాడు. ఆ స్థితిని మనమందరం పొందగలగాలి.

- సశేషం

# విజయవాడలో సత్సంగ సమావేశములు

సర్వాధిష్ఠాన చైతన్య సమర్థ సద్గురు
శ్రీశ్రీశ్రీ హనుమత్ కాళీవర ప్రసాద బాబూజీ మహరాజ్‌వారి
దివ్యాశీస్సులతో,
శ్రీకాళీవనాశ్రమ పీఠాధిపతి, పూజ్యశ్రీ
యోగిని శ్రీచంద్రకాళీ ప్రసాదమాతాజీవారి
సత్సంగ సమావేశములు

విజయవాడ, దుర్గాపురం లోని ఘంటశాల వెంకటేశ్వరరావు సంగీత నృత్యకళాశాలలో సెప్టెంబర్ 18, 19, 20 (శుక్ర, శని, ఆదివారాలలో) సాయంత్రం 6గం. నుండి రాత్రి 8గం. వరకు జరుగును.



అందరూ ఆహ్వానితులే!

ఉదయం కార్యక్రమములు -

తెIIజా 4గం నుండి 6గం. సుప్రభాతము, ప్రార్థన ప్రతిరోజూ జరుగును.

18-9-15 శుక్రవారం ఉదయం 9గం.లకు సంకీర్తన, లలితా సహస్ర నామంతో సామూహిక కుంకుమ పూజలు జరుగును.

19-9-15 శనివారం ఉదయం 9గం.లకు సంకీర్తన, ఆంజనేయ స్వామికి ఆకుపూజ, సిందూరాలతో సామూహిక పూజలు జరుగును.

20-9-15 ఆదివారం ఉదయం 9గం.లకు సంకీర్తన, ఆదిత్యహృదయ పారాయణ జరుగును.

ఈ మూడురోజులూ పూజ్యశ్రీ మాతాజీవారిచే తీర్థవితరణ, తరువాత మహాప్రసాద వినియోగం కలదు.

ఈ పైన చెప్పిన ఉదయం కార్యక్రమాలు జరుగు స్థలము ....

డాIIపై కృష్ణమనోహర్ 101, సాయి సూర్య ఎన్‌క్లేవ్, రెండవలైను, కేదారేశ్వర పేట, విజయవాడ - 3

వివరములకు -

94405 41266 ; 96188 37160

92464 15286 ; 86867 53336

92465 99800 ; 99488 41228

ఈ నెంబర్లను సంప్రదించవలెను.

# సత్సంగామృతం

- మురళీ

ఒక బాటసారి అడవిలో ప్రయాణం చేస్తున్నాడు. అతనికి ఆకలి వేసింది. అక్కడున్న మామిడి చెట్టు నించి పళ్ళు కోసుకుతిన్నాడు. తరువాత మంచినీరు కావలస్సివచ్చింది. నీరు ఎక్కడా దొరకలేదు. దూరంగా వున్న బావి దగ్గరకు వెళ్ళాడు. తీరా అక్కడికి వెళ్ళాక బాల్చీ లేదు. దాహం వేస్తోంది. బావిలో నీరు ఉన్నది. కాని తోడుకునే మార్గం లేదు. ఆ సమయంలో నీరు అందే మార్గంగాని, సహాయంగాని చేసేవారు కావాలి. ఇంతలో బాటసారిని ముగ్గురు దొంగలు పట్టుకుని అతని దగ్గర వున్నదంతా దోచుకున్నారు. ఏమీ చేయలేని స్థితిలో అతనున్నాడు.



ఆ ముగ్గురు దొంగలలో మొదటివాడు 'వీడిని వూరకనే వదలటమెందుకు? వీడి తల తీసెయ్యండి' అన్నాడు. అంతలో రెండవ వాడు 'అంతవరకు యెందుకు? కాళ్ళు చేతులు కట్టిపడవేస్తే చాలదా?' అని, వాడిని కట్టిపడేసి వెళ్ళారు. కొంతదూరం వెళ్ళాక ఆ దొంగలలో మూడవవాడు వెనక్కి తిరిగి వచ్చి, ఆ బాటసారిని అనవసరంగా కట్టటం యెందుకని, కట్లువిప్పి, 'నీవు భోగభాగ్యాలు కలిగివుండటం వలన నీకు యీ బంధన తెచ్చిపెట్టాయి. ఇక వాటి జోలికి పోకు' అని చెప్పి, నీకు వెళ్ళవలసిన దారి చూపిస్తానని పొలిమేర వరకు తోడు వచ్చి యింటికి పొమ్మన్నాడు. ఆ బాటసారికి ఆ దొంగ మీద ప్రేమ, అభిమానం కలిగి తన యింటికి రమ్మనమన్నాడు. ఆ దొంగ బాటసారితో 'నీకు మార్గం చూపించే వాడినేకాని, నీకు తోడుగా వచ్చేవాడిని కాదు' అన్నాడు.

ఆ బాటసారి యెవరు? జీవుడు. సంసారంలో జననమరణ ప్రవాహంలో వున్న విషయాదులనబడే ప్రపంచమే మహా అడవి. ఈ

అడవిలో యీ జీవుడు యేమి చేస్తున్నాడో, యేమి తెస్తున్నాడో, యేమి దాచుకుంటున్నాడో! అన్నీ నావి, నాకే కావాలి అనుకొని, అన్నిటినీ పట్టుకుని కూర్చుంటున్నాడు. సత్త్వరజస్తమో గుణాలే ఆ ముగ్గురు దొంగలు. మొదటి దొంగ తమోగుణం కలవాడు. అతడు బాటసారిని చంపేయ మన్నాడు. రెండవాడు రజోగుణం కలవాడు. అతడు బాటసారిని కట్టిపడేయమన్నాడు. మూడవవాడు సత్త్వగుణం కలిగినవాడు. అతడు వెనక్కివచ్చి, అతని యింటికి దారి చూపించాడు. అతడే గురువు.

వయస్సు పైబడినకొద్దీ చెవులు వినబడవు. కళ్ళు కనబడవు. మనకి పట్టిన మురికి ఎలా పట్టిందని గుర్తిస్తే దాన్ని యెలా వదిలించు కోవాలో తెలుసుకోవచ్చు.

సత్త్వ గుణం యేమిచేసింది? త్రోవ చూపించింది. దగ్గరకు తీసుకు వెళ్ళింది. నువ్వు మళ్ళా ఆ గుణాలను వెంటబెట్టుకున్నావో, అవి నిన్ను తరుముతూనే వుంటాయి. గుణరహితం అవ్వాలంటే గురువును ఆశ్రయించాలి. గురుదేవునిపట్ల విశ్వాసం మనకు వుండాలి. నా ప్రభువు వున్నాడు! నాకెటువంటి భయము లేదనే విశ్వాసం వుండాలి. ఈ త్రిగుణాలను గురించి శ్రీగురుదేవులు వివరిస్తూ -

ఒక దీపం వుంది. ఆ దీపాన్ని మూడు మూకుళ్ళు కప్పివున్నాయి. ఒకటి ఇనప మూకుడు. రెండవది చిల్లుల మూకుడు. మూడవది గాజు మూకుడు. ఇనప మూకుడు కప్పివుంటే దీపం మనకు కనిపించదు కదా! ఇది తమోగుణానికి సంకేతం. రెండవదైన చిల్లుల మూకుడు రజో గుణానికి సంకేతం. దీని ద్వారా వస్తుదర్శనం అవుతుంది. మూడవది గాజు మూకుడు. ఇది సత్త్వగుణానికి సంకేతం. దీని ద్వారా వస్తుదర్శనం పూర్తిగా అవుతుంది. కాని ఆ జ్యోతిని నీవు చేరలేవు. అది కూడా తొలగిస్తే నీవు ఆ జ్యోతిని దర్శించి అందులో లయించిపోతావు! త్రిగుణ రహితమైతే గాని త్రిగుణాతీతుడు అవలేవు. అట్టి త్రిగుణాతీతుడైన గురుపాదుకలు సర్వదా కాపాడుగాక! అట్టి స్థితిని మనకు శ్రీగురుదేవులు ప్రసాదించెదరు గాక! సుఖీభవ! సుఖీభవ!!

# సోమదత్త ఎక్కడ?

-పరాశర ప్రసాద్

'ఆలి లేదు చూలి లేదు, కొడుకుపేరు సోమదత్తుడట' అన్నది వేదాంతంలో చాలా ప్రసిద్ధికెక్కిన అంశమే. అది మాయను తెలియబరచే కథ. మాయ అనేది చాల చిత్రమైనది. ఏది లేదో అదే మాయ. అందువల్ల 'యా మా సా మాయ' అని చెబుతారు.

గురూపదేశాన్ని పొందిన పిన్నవయస్కుడైన వొక బ్రహ్మచారి దేశ సంచారానికి దివ్యక్షేత్ర దర్శనానికి బయలుదేరి వెళ్ళాడు. ఒకనాడు మండుటెండలో తిరిగి తిరిగి అలసిపోయాడు. గంగానదీ సమీపాన చెట్టు నీడన చేరాడు. కొద్దిసేపు సేద తీర్చుకున్నాడు. ఆ సమీపానే విశ్రమించటానికి అనువుగా ఒక సన్నని శిలని యెంపిక చేసుకున్నాడు. నెమ్మదిగా శరీరాన్ని ఆ శిలమీద విశ్రమింపజేశాడు.

నిమిష కాలంలోనే నిద్రలోకి జారుకున్నాడు. అంతలోనే మెలకువ వచ్చింది. అది గాఢ నిద్రకాదు, మెలకువ కాదు ఆ స్థితిలో గంగానది తీరాన యిద్దరు స్త్రీలను దర్శించాడు. వారిరువురు కుండలలో నీరు నింపుకుని వెళ్ళిపోయారు.

కలత నిదురలో వున్నాడేమో, మనస్సులో ఒక సంకల్పం జనించింది. ఆ యిద్దరూ చూడ ముచ్చటగా వున్నారు. అందులో యెవరో ఒకరిని వివాహం చేసుకుంటే యెలా వుంటుంది? ఆ తరువాత మూడు గదులుగల గృహం కట్టుకుంటాను. నేను కష్టపడి ధనాన్ని ఆర్జించి, దానితో తృప్తిచెంది ఆనందకరమైన జీవితాన్ని గడుపుతాను. చక్కగా అందంగా బొద్దుగా వున్న మగపిల్లవాడిని పొందిన తరువాత, నేను నా భార్య, నా పుత్రుడు ఒకే మంచం మీద నిద్రిస్తాము.

మా పిల్లవాడు సురక్షితంగా వుండాలంటే మా యిద్దరి మధ్యన వాడిని పడుకోబెట్టుకోవాలి. పాపం! వాడికి సరిపడ స్థలం కావాలి కదా! 'దేవీ! కొంచెం ప్రక్కకు జరుగు' అని భార్యను ఆదేశించాడు. ఆమె తిరిగి సమాధానం చెబుతూ 'ప్రభూ! నేను జరగటానికి తగిన స్థలం లేదు. మీరే కొంచెం ప్రక్కకి జరగండి' అనగానే వెంటనే 'సరేలే దేవీ! నేనే

జరుగుతాను' అంటూ కలత నిదురలో సన్నగా వున్న ఆ రాతి మీద జరగటమూ, ప్రక్కనే వున్న గంగానదిలో పడిపోవటమూ జరిగింది. మెలకువ వచ్చింది. నెమ్మదిగా యీదుకుంటూ వచ్చి ఒడ్డుకు చేరాడు. మరి తన భార్యా బిడ్డలు యేమైనట్లు? వారిని తను కలుసుకోగలడా?

అదే మాయ! బ్రహ్మచారి తన స్వప్నజగత్తులో నిర్మించుకున్న మనో సంసారమే మాయ. అలాగే మానవుడు తన మనో సంసారమనే స్వప్నంలో నుండి గురు సందేశము ద్వారా మేల్కొని తన స్వస్వరూపాన్ని గుర్తించాలి. అంతవరకు ప్రతివారు సోమదత్తుని తండ్రి పాత్ర వహించక తప్పదు!



19-10-2015 సోమవారం మూలా నక్షత్రం సరస్వతీ పూజ

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

- విజయేశ్వరానంద ప్రసాద్

## కోటిపల్లి మామ్మగారు

"ఓసేయ్! సీతారామాంజనేయం! అప్పుడు నాకు ధ్యానంలో ఒక కుఱ్ఱవాడి లాగ దర్శనమిచ్చిన నా రామచంద్ర ప్రభువు వీడేనే!" అని అంతమంది జనంలోనూ, శ్రీబాబు చెయ్యి పైకెత్తి పట్టుకుని బిగ్గరగా అరిచింది ఒక మామ్మగారు.



1948లో గుండుగొలనులో గోపాల రాజుగారింట్లో జరుగుతున్న శ్రీదేవీ శరన్నవరాత్రి పూజలలో ఒకరోజున జరిగిన సంఘటన యిది. ఆ మామ్మగారే కోటిపల్లి మామ్మగారు. ఆమె మనవరాలే సీతారామాంజనేయాంబ; ఉరఫ్ పోతునూరు అక్కయ్య; ఉరఫ్ సక్కుబాయి.

కోటిపల్లి మామ్మగారైన శేషమాంబగారు శ్రీరామ భక్తులు. తూర్పుగోదావరి జిల్లాలోని కోటిపల్లి వారి స్వగ్రామం. ఆమెకు వివాహమైన కొద్దికాలంలోనే వెంకటరమణ అనే కుమార్తె కలిగాక భర్తృ వియోగం కలిగింది. ఆమె నిరంతర శ్రీరామచింతన పరురాలై రామధ్యానంలోనే సమయం గడిపేవారు.

1923వ సంవత్సరంలో ఆమె నారాయణపురంలో వుండగా ఒక రోజున ధ్యానంలో శ్రీరామచంద్ర ప్రభువు సుమారు యిరవై సంవత్సరాల నవయువకుడిగా ఆమెకు దర్శనమిచ్చారు. ఆయన చేతిలో ఒక పుస్తకం వున్నది. దానిపై పేరు ఆమెకు పూర్తిగా కనబడలేదు గాని, పేరు చివరి భాగం మాత్రం ".................వస్తు సుధానిధి' అని వున్నట్లు మామ్మగారు చూశారు. శ్రీరామ ప్రభువు మామ్మగారితో "కొంతకాలం తరువాత నేను మానవుడిగా అవతరించి యీ రూపంలో నీకు దర్శనం యిస్తాను. ఇదిగో యీ

ఆశ్రమంలో వుంటాను" అని ఒక పెద్ద మామిడితోట, అందులో ఒక పెద్ద ఆశ్రమము చూపించారు. (అదే యిప్పటి కాళీ వనాశ్రమం). ఆ ఆశ్రమం ఎంతో మనోహరంగా వున్నది. అనేక దేవాలయాలు ఎన్నో భక్తుల యిళ్ళు, వందలమంది భక్తులు, సంకీర్తన చేసేవారు, ధ్యానం చేసుకునేవారు, పెద్దపెద్ద బారులలో కూర్చుని ధ్యానం చేసుకునేవారు, పెద్దపెద్ద పూజలు - ఓహ్! రంగరంగ వైభవంగా కనిపించింది. శ్రీరామ ప్రభువు "నువ్వు కూడా కొంతకాలం నన్ను యిలా దర్శించుకుంటూ, ఈ ఆశ్రమంలో వుంటావు. ఆ తరువాత నిన్ను నా సన్నిధికి చేర్చుకుంటాను. మేము యిక్ష్వాకు వంశజులము. మాట తప్పనివారము" అని చెప్పి అదృశ్యం అయ్యారు.

అప్పటి నుండి మామ్మగారు చెదరని విశ్వాసంతో, సడలని పట్టుదలతో ఆ నవ యువకుని రూపంలో కనిపించబోయే శ్రీరామ ప్రభువు దర్శనం కోసం నిరీక్షించారు. ఇరవై ఐదేళ్ళ అనంతరం ఆమె నిరీక్షణ ఫలించింది.

మామ్మగారి కుమార్తె వెంకట రమణమ్మగారికి కోటిపల్లి నివాసులైన రెడ్డి సత్యనారాయణ మూర్తిగారితో వివాహం అయింది. వారికి ముగ్గురు కుమార్తెలు, నలుగురు కుమారులు కలిగారు. మామ్మగారు ఆ మనుమలను, మనుమరాళ్ళను కూర్చోబెట్టుకుని, తనకు రాముడు ఒక యువకుని రూపంలో దర్శనమిచ్చిన సంగతి చెబుతూ, "నీలమేఘ ఛ్ఛాయతో, దివ్యకాంతులతో మెరిసే కన్నులతో, ఎన్నో ఆభరణాలతో ఎంతో అందమైన కుఱ్ఱవాడుగా కనబడతాడు నా రాముడు. తప్పకుండా దర్శనమిస్తానన్నాడు. ఒకవేళ ఆ లోపే (తనను చూపించుకుంచూ) యీ బుడగ చితికిపోతే, వాడు మీకైనా తప్పక దర్శనమిస్తాడు. గుర్తించండి. వాడి పాదం వదలకండి. ఏమి యిస్తానన్నా వద్దని, నువ్వే కావాలని వాణ్ణి పట్టుకోండి" అని మాటిమాటికీ చెబుతూ వుండేవారు.

- సశేషం

-గత సంచిక తరువాయి

# విష్ణు  కథలు

- రమణ ప్రసాద్

## కబీర్‌దాస్

కబీర్‌దాస్ సరుకులు భార్యకు అప్పగించాడు. కుమారుడు ఏడి? అని అడిగింది లోయీ. కబీర్ కమాల్ శిరస్సును లోయీ చేతిలో పెట్టి జరిగిన వృత్తాంతమంతా చెప్పాడు. లోయీ కమాల్ చేసిన త్యాగానికి సంతసించింది. కమాల్ వంటి పుత్రరత్నం తమకు కలగటం తమ భాగ్యమని మురిసిపోయింది. ఆహా! ఎంతటి మహత్తర అవగాహన! సాధుసత్తములకు ఆతిధ్యమివ్వటానికై తమ ఏకైక పుత్రుడిని త్యాగం చేసిన వారి ఉదాసీనత ఎలాంటిది?



ప్రేమ బిక్ సత్ మై (సునా మాథే సాటే హాట్।
బూఝత్ విలమ్బన కీజయే తత్‌ఛిన దీజై కాట్॥

"తలకు బదులుగా ప్రేమ సంతలో దొరుకుతుందని తెలిస్తే ఆలస్యం చేయకుండా నీ శిరాన్ని అర్పించి ప్రేమను సంపాదించు" అంటాడు కబీర్. ఆహా! ఎంత ఉదాత్తమైన భావన!

లోయీ కుమారుని శిరస్సును దాచి షోడ్రసోపేతంగా వంట చేసింది. జ్ఞానదేవులవారు తమ అమృత వాక్కులతో సంతృప్తి పరచారు. నామదేవులవారు తమ సంకీర్తనతో భక్తులను అలరింపచేశారు. అందరూ ఆతిధ్యాన్ని స్వీకరించి ఆ సాయంత్రం సంకీర్తన చేస్తూ బయలుదేరారు.

గడచిన రాత్రి కబీర్‌దాస్ కమాల్ శిరస్సును తెచ్చాడు. మొండెం అక్కడే ఉండిపోయింది. వ్యాపారి గ్రామస్థులనందరినీ ఒకచోట చేర్చి విషయమంతా వివరించాడు. ఆ మొండెం ఎవరిదో గ్రామస్తులు గుర్తించలేకపోయారు. వీధిలో ఒక స్థంభం పాతి ఆ మొండాన్ని కట్టారు. తల్లిదండ్రులు తప్పక వస్తారని అభిప్రాయ పడ్డారు.

జ్ఞానదేవ, నామదేవులు భక్తులతో సంకీర్తన చేస్తూ ఆ దారిలోనే వస్తున్నారు. వారు సమీపానికి రాగానే కమాల్ మృతదేహం వారికి రెండు చేతులూ జోడించి నమస్కరించింది. వారు చేస్తున్న సంకీర్తనకు అనుగుణంగా తాళం వేస్తోంది. ఈ దృశ్యం చూసి భక్తులంతా దిగ్భ్రాంతి చెందారు. జ్ఞానదేవులు కబీర్‌ను సమీపించి "ఈ రహస్యం ఏమిటో నీకు తెలిసి ఉండాలి, భక్తులకు నివేదించండి" అని చెప్పారు. కబీర్‌దాస్ జ్ఞానదేవుల వారికి చేతులెత్తి నమస్కరిస్తూ "మహాత్మా! వీడెవడో విష్ణుభక్తుడై ఉండాలి. మీరు గానం చేసే సంకీర్తన వినటానికి ఇంకా తన ప్రాణం నిలబెట్టుకున్నాడు" అన్నాడు. కబీర్ దుఃఖాన్ని ఆపుకోలేక పోయాడు. జ్ఞానదేవులవారు తన జ్ఞానదృష్టి ద్వారా జరిగినది గ్రహించి భక్త కమాల్ ప్రహ్లాదుడి వంటి భాగవతోత్తముడు అని పొగిడారు. కమాల్ శిరస్సును తెప్పించి పాండురంగ నామం గానం చేస్తూ ఆ శిరస్సును మొండెంపై ఉంచారు. కమాల్ సజీవుడైనాడు. భక్త కమాల్ వెంటనే పరిగెత్తుకుంటూ వచ్చి, జ్ఞానదేవుల వారికి, నామదేవులవారికి, భక్తులందరికి సాష్టాంగ ప్రణామాలు చేశాడు.

కబీర్‌దాస్ ఒక చెట్టు క్రింద కూర్చుని రొట్టె తింటుంటే, ఒక కుక్క వచ్చి ఆ రొట్టె లాక్కెళ్ళిపోయింది. ఆ కుక్కలో శ్రీరాముణ్ణి దర్శించిన కబీర్ దాని వెంటపడి "ఏ రోటీ సూఖాహై, జరా ఘీ తో లగానే దీజియే" (ఇది నిప్పుమీద కాల్చిన రొట్టె. దీని మీద కొంచెం నెయ్యి రాయనీయి (ప్రభూ) అంటూ వెంట పడ్డాడు. ఆ కుక్క ముళ్ళ కంపలలో నుండి పరిగెడుతుంటే కబీర్ తన శరీరం రక్తసిక్తమౌతున్నా లెక్కపెట్టక ఆ కుక్క వెంట పరిగెత్తి, ఆ రొట్టెకి నెయ్యి రాచి దానితో తినిపించాడు. అదీ మహాత్ముల లక్షణం. వారు అంతటా పరమాత్ముణ్ణే దర్శిస్తారు. అతనికి రామదర్శనం అయింది.

- సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL